ఈనాడు అనకాపల్లి

శుక్రవారం 27 సెప్టెంబరు 2024 7

సింహాద్రి అప్పన్న సేవలో మంత్రి లోకేశ్



ఆలయ ప్రాంగణంలో భక్తులకు అభివాదం చేస్తున్న మంత్రి

సింహాచలం, న్యూస్‌టుడే: రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు, ఈవో త్రినాథరావు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అంతరాలయంలో స్వర్ణకవచంలో ఉన్న సింహాద్రినాథుడిని దర్శించుకున్నారు. ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు పెతకంశెట్టి గణబాబు, బండారు సత్యనారాయణ మూర్తి, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోల బదిలీ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లి ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ, నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వీ జయరాంలను బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనకాపల్లి ఆర్డీవోగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ట్రైనింగ్ పూర్తిచేసుకున్న షేక్ అయిషాను నియమించారు. పాలకొండ ఆర్డీవోగా పనిచేస్తున్న విల్లూరి వెంకటరమణను నర్సీపట్నం ఆర్డీవోగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ప్రభుత్వ ఆదాయం పెంచుతా..

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి సబ్ రిజిస్ట్రార్‌గా రవికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న అప్పారావుకు బదిలీ అయింది. టెక్కలిలో పనిచేస్తున్న



రవికుమార్ ఇక్కడ నియమితులయ్యారు. విధుల్లో చేరిన ఆయన ముందుగా రికార్డులు పరిశీలించారు. ఇక్కడ కార్యాలయంలో 1840 సంవత్సరం నుంచి రికార్డులున్నాయి. అధికారులు, సిబ్బంది, దస్తావేజు లేఖర్లు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్లకు వచ్చేవారికి త్వరితగతిన సేవలందిస్తామన్నారు. నిబంధనలు కచ్చితంగా పాటిస్తామని పేర్కొన్నారు. కార్యాలయాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ది ప్రభుత్వానికి ఆదాయం పెంచుతామని చెప్పారు.

బొజ్జన్న కొండ.. పర్యాటక అండ



అనకాపల్లి మండలంలో శంకరం గ్రామాన్ని ఆనుకొని ఉన్న ఆధ్యాత్మిక ఆరామం బొజ్జన్న కొండ పర్యాటకంగానూ అభివృద్ధి చెందుతోంది. రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి పర్యటకులు కొండ సందర్శనకు వస్తున్నారు. కొండపైనున్న బౌద్ధస్తూపాలు, విహారాలు, బుద్ధ భగవానుని పెద్ద శిలా విగ్రహాలు ఆనాటి చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తాయి.



కొండపై బౌద్ధ భిక్షువులు (పాత చిత్రం)

ఈనాడు, అనకాపల్లి, న్యూస్‌టుడే, కలెక్టరేట్

ప్రాచీన బౌద్ధ శిల్పకళా సంస్కృతిలో బుద్ధుని కొండకు ప్రత్యేక స్థానం ఉంది. కాలక్రమేణా బొజ్జన్న కొండగా రూపాంతరం చెంది ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందింది. పురావస్తు శాఖ అధికారులు సైతం ఈ కొండ అభివృద్ధికి, ప్రాచీన సంపదను పరిరక్షించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అనకాపల్లి పట్టణం ఆవిర్భవించక ముందే శంకరం పంచాయతీ పరిధిలోని బొజ్జన్న కొండ ప్రసిద్ధిగాంచింది. క్రీస్తు పూర్వం నుంచే ఇది బౌద్ధారామంగా విరాజిల్లింది. 1906-1908లో అలెగ్జాండర్ రిమ్ ఆధ్వర్యంలో ఇక్కడ జరిగిన తవ్వకాల్లో అలనాటి రాజశాసనాలు, నాణేలు, ముద్రలు, బౌద్ధ క్షేత్ర అవశేషాలు బయటపడ్డాయి. ఇక్కడ లభ్యమైన బంగారు నాణేలు కొన్ని సముద్రగుప్తుని హయాం లోవి. మరికొన్ని శాతవాహనుల కాలానివని చరిత్రకారులు తేల్చారు. కొండపై మొదటి గుహలో బుద్ధుని నిలువెత్తు స్తూపం ఉంది. దీని పైభాగంలోని గుహలో ధ్యానముద్రలోని బుద్ధుడి విగ్రహం ఉంది. అక్కడి గదుల్లో బౌద్ధులు ధ్యానం చేసేవారని చరిత్ర చెబుతోంది. మరోపక్క ఈ కొండను ఆనుకొని లింగాల కొండ ఉంది. ఇక్కడ వందల సంఖ్యలో లింగాకార స్తూపాలున్నాయి. మత్స్యాకారంలో ఉన్న లింగాల కొండ నమూనాగా జావా ద్వీపంలో బోరోబుదూరు బౌద్ధ క్షేత్రం నిర్మించారని చరిత్రకారులు చెబుతున్నారు.

కొండపై నుంచి చూస్తే శంకరం గ్రామం చుట్టూ ఉన్న పచ్చని పంటపొలాలు, సమీపంలోని పారే ఏలేరు కాలువ సందర్శకులకు కనువిందు చేస్తాయి. కనుమ పండుగనాడు భారీఎత్తున జరిగే తీర్థం కోసం జనం తరలివస్తుండడంతో కొండను మరింత ముస్తాబు చేస్తుంటారు.

కొండకు చేరుకొనే మార్గం ఇలా....

సబ్బవరం రహదారిని ఆనుకొని ఉన్న బొజ్జన్న కొండకు విశాఖ నుంచి అనకాపల్లి లేదా సబ్బవరం మీదుగా చేరుకోవచ్చు. సబ్బవరం మీదుగా వచ్చే వారు శంకరం ఏలేరు కాలువ కూడలి వద్ద దిగాలి. అక్కడ నుంచి కొండ ప్రధాన రహదారి మీదుగా కిలోమీటరు వెళ్లాలి. అనకాపల్లి నుంచి బొజ్జన్న కొండ ఐదు కిలోమీటరు దూరంలో ఉంది. చోడవరం, ఆపై ప్రాంతాల నుంచే వారు తుమ్మపాల మీదుగా ఉన్న ఏలేరు కాలువ సమీప గట్టునుంచి ఉన్న రోడ్డులో వెళ్లాల్సి ఉంది. ఇటీవల ఈ రహదారిని బీటీతో అధునాతనంగా తీర్చిదిద్దారు. సబ్బవరం రహదారి నుంచి కొండకు రావడానికి వీలుగా రూ.70 లక్షలతో సిమెంట్ రహదారి వేశారు. దీంతో రాకపోకలకు అనుకూలంగా ఉంది.

చరిత్రాత్మకం.. ఆధ్యాత్మిక నేపథ్యం

★ దేశ, విదేశీ సందర్శకుల తాకిడి



ముస్తాబైన ధ్యాన మందిరం

▶▶ నేడు ధ్యానమందిరం, లేజర్ షో ప్రారంభం: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని శుక్రవారం పురావస్తుశాఖ, ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. రూ.7.50 కోట్లతో కొండ అభివృద్ధిలో భాగంగా ధ్యాన మందిరం, బుద్ధుడు, బొజ్జన్న కొండ చరిత్రలను తెలిపే లేజర్ షో ఏర్పాటు చేశారు. వీటిని శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. హోంమంత్రి అనితతోపాటు, ఎమ్మెల్యేలు, ఎంపీ, కేంద్ర మంత్రి, కలెక్టర్ విజయకృష్ణన్ ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు.


నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

సుందర తీరానికి హంగులెప్పుడో!

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే

ఎస్.రాయవరం మండలంలోని రేవుపోలవరం తీరం ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందింది. ఇక్కడి కొండపై శివపార్వతుల విగ్రహాలు, భూదేవి శ్రీదేవి సమేత లక్ష్మీమాధవ స్వామి ఆలయం ఉన్నాయి. సముద్రంపై జెట్టీ, తీరాన్ని ఆనుకుని ఉన్న కొబ్బరి తోటలు పర్యటకులకు కనువిందు చేస్తున్నాయి. వారాంతంతో పాటు, నిత్యం ఇక్కడ కోలాహలంగా ఉంటుంది. ఈ ప్రాంతంలో తరచూ సినిమాల చిత్రీకరణ, షార్ట్ ఫిల్మ్స్, జంటల ఫొటో షూట్లు జరుగుతున్నాయి.

జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి సాగర తీరం చూసేందుకు వచ్చే పర్యాటకులకు ఇక్కడ కనీస వసతులు లేకపోవడంతో నిరాశ చెందుతున్నారు. భోజనాలు చేసేందుకు నీడలేకపోవడం, కనీస మౌలిక వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు లేకపోవడం వంటి సమస్యలు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యటకులకు వెక్కిరిస్తున్నాయి.



రేవు పోలవరం తీరం సోయగం

గత అయిదేళ్ల వైకాపా పాలన పర్యాటకం ప్రాంతాల అభివృద్ధిని గాలికి వదిలేసింది. కనీస మౌలిక వసతులు సమకూర్చడంతో విఫలమైంది. ఈ ప్రాంతం అభివృద్ధిని ఇక్కడి ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో తీరం మరింత అధ్వానంగా మారింది. ఎనిమిదేళ్ల క్రితం తెదేపా ప్రభుత్వంలో నిర్మించిన పాకలు, విశ్రాంతి గదుల నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో ఆకతాయిలు గదులను ధ్వంసం చేశారు. పర్యాటకులు సేద తీరేందుకు ఏర్పాటు చేసిన పాకలకు నిప్పుపెట్టడంతో కాలిపోయాయి. అప్పటి నుంచి తీరం అభివృద్ధికి నోచుకోలేదు. తీరంలో ఒక్క మరుగుదొడ్డి కూడా లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని గమనించి ఇక్కడ సార్వత్రిక ఎన్నికల ముందు రూ.5 లక్షలతో నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు ఇప్పటికీ ప్రారంభించకపోవడం గమనార్హం.

ఇక్కడ పర్యటకులు సందర్శించే ప్రాంతమంతా వ్యర్థాలు, చెత్తాచెదారం దర్శనమిస్తున్నాయి. ఆకతాయిలు మద్యం సేవించి బాటిళ్లను లక్ష్మీమాధవస్వామి కొండపై పడేయడంతో ఆ ప్రాంతమంతా సీసా పెంకులు పేరుకుపోతున్నాయి. దీంతో కొండపైకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు.



వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటాం: రేవుపోలవరంలో మౌలిక వసతులు కల్పనకు పర్యాటక శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. పర్యటకులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తాం. ఇక్కడ బయట నుంచి వచ్చిన చిరు వ్యాపారులు చెత్తాచెదారాలను పారబోస్తున్నారని మా దృష్టికి వచ్చింది. దీనిపై పంచాయతీ సిబ్బందితో మాట్లాడి, తీరంలో పారిశుద్ధ్యం పనులు చేయిస్తాం. సామాజిక మరుగుదొడ్లు వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటాం

– సత్యనారాయణ, ఇంఛార్జి ఎంపీడీఓ, ఎస్.రాయవరం

అప్పుడే ఖాళీ!

రెండు నెలల్లో 24 వేల టన్నుల ఇసుక విక్రయం



నక్కపల్లి డిపో జులైలో ఇలా..

నక్కపల్లి, న్యూస్‌టుడే

వైకాపా పాలనలో నూతన ఇసుక పాలసీ పేరుతో గడిచిన అయిదేళ్లు ప్రజలకు చుక్కలు చూపించారు. ధర భారీగా ఉండటంతో మధ్య తరగతి, సామాన్య ప్రజలపై నిర్మాణ భారం అమాంతం పెరిగిపోయింది. చాలామంది ఉపాధి లేక ఇబ్బందులూ పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల్లో హామీలో భాగంగా సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక విధానం అమలులోకి తెచ్చారు. ఆ మేరకు జులై 8 నుంచి అధికారికంగా డిపోలను తెరిచి ఇసుక అమ్మకాలు చేపట్టారు. జిల్లాలో అప్పటికి నక్కపల్లి, నర్సీపట్నం మండలం గబ్బాడ డిపోల్లో మాత్రమే ఉంది. ఇందులో నక్కపల్లిలో మాత్రమే విక్రయాలకు అనుమతులు ఇచ్చారు. అమ్మకాలు ప్రారంభం నాటికి ఇక్కడ 28,915 టన్నులు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడకు రాజమహేంద్రవరం నుంచి తెచ్చిన ఇసుక కావడంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం టన్ను ధర రూ. 88, రవాణా ఛార్జీలను కలిపి రూ.1225 చొప్పున నిర్ణయించారు. ఇది వినియోగదారులకు కాస్త ఇబ్బందిగా మారింది. ఇక్కడ అమ్మకం కాగానే అందుబాటులో ఉన్న వనరుల నుంచి మరింత సేకరించి తగ్గింపు ధరకు లభించేలా చూస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు పరిధి నిబంధనతో అనకాపల్లి జిల్లాలోని వారంతా తమ అవసరాల నిమిత్తం ఇక్కడకే రాసాగారు. మొదట్లో అమ్మకాలు నెమ్మదిగా సాగినా తర్వాత ఊపందుకున్నాయి. తొలి నెలరోజుల్లో కేవలం అయిదువేల టన్నులు మాత్రమే వెళ్లగా, ఈ రెండు నెలల్లో సుమారు 24 వేల టన్నుల వరకు విక్రయించేశారు.



ఇప్పటికే బుక్ చేసుకున్న వారికోసం ఇసుక తరలింపు

ఆన్‌లైన్‌తో తగ్గిన ధర

ఇసుక కొనుగోలుకు ఆన్‌లైన్ విధానం తీసుకురావడంతో ఖరీదు టన్ను వద్ద దాదాపు రూ. వంద వరకు తగ్గింది. ప్రస్తుతం టన్ను ధర రూ. 1165 ఉంది. మరోవైపు బుకింగ్‌కు ప్రయత్నించిన వారికి నక్కపల్లి డిపోలో సరకు లేదని సమాధానం వస్తోంది. ప్రస్తుతం డిమాండ్ ఉంది. తీరా ఇక్కడ నిల్వలు లేవని తెలిసి చాలామంది నిరాశ చెందుతున్నారు.

“నిల్వలు లేకపోవడంపై సంబంధిత శాఖ అధికారి రవికుమార్‌ను ‘న్యూస్‌టుడే’ వివరణ కోరగా, ఇక్కడ ఇసుక లేని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టామన్నారు. త్వరలోనే అందుబాటులోకి తెస్తామని తెలిపారు.”

మహిళల ఉపాధికి భరోసా

అచ్యుతాపురం, న్యూస్‌టుడే

మహిళా సాధికారికతకు చేయూత ఇవ్వడానికి సెజ్‌లోని సెయింట్ గొబైన్ కంపెనీ ముందుకొచ్చింది. స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. రెండు నెలలుగా ఆర్థిక భరోసా కల్పించే శిక్షణ కార్యక్రమాలు అమలు చేస్తోంది. బార్క్ భవనంలో రోజూ వీరికి ఉచిత శిక్షణ ఇస్తున్నారు. 10 మంది మహిళలతో ప్రారంభమైన ఈ శిక్షణ నేడు వందమందికి చేరింది. దుస్తులు కుట్టడం, మగ్గం, కొవ్వొత్తులు, పచ్చళ్లు, అప్పడాల తయారీ, డేటా ఎంట్రీ, బ్యూటీషియన్ కోర్సుల్లో నైపుణ్యంగల నిపుణులతో శిక్షణ అందిస్తున్నారు. దీనికి సమీప గ్రామాల నుంచి మహిళలు వస్తున్నారు. మొదటి బ్యాచ్ శిక్షణ ఇప్పటికే పూర్తయ్యింది. ఎక్కువమంది మహిళలు బ్యూటీషియన్ కోర్సుతో పాటు కుట్టు శిక్షణ పొందడంపై ఆసక్తి చూపిస్తున్నారు. వీరికి ప్రభుత్వం నుంచి రాయితీపై రుణాలు అందించడానికి నిర్వాహకులు కసరత్తు చేస్తున్నారు.



శిక్షణ పొందుతున్న మహిళలు

ఇంటివద్దే దుస్తుల తయారీ: కుట్టుమిషన్‌పై ఎప్పటి నుంచో ఆసక్తి ఉన్నా అవకాశం లేక నేర్చుకోలేకపోయాను. 20 రోజుల్లోనే దుస్తులు కుట్టే సామర్థ్యం పొందాను. ఇంటివద్ద కుట్టుమిషన్ ఉండడం వల్ల కొంత ఆదాయం పొందే అవకాశం ఉంది. దుస్తుల తయారీ పరిశ్రమలో ఉపాధి పొందడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుంది.



– ఎల్.రాధ, మోటూరుపాలెం

నమ్మకం కలిగింది: ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. బ్యూటీషియన్, కుట్టుమిషన్‌పై శిక్షణ పొందాను. ఇంటి వద్ద ఉండి డబ్బులు సంపాదించుకోవచ్చనే నమ్మకం కలిగింది.



–లక్ష్మీప్రసన్న, గురుజాపాలెం

కంపెనీ సహకారంతో..

శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి సెయింట్ గోబైన్ కంపెనీ ముందుకొచ్చింది. కుట్టుమిషన్, అప్పడాలు, మగ్గం, కొవ్వొత్తులు, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నాం. సెజ్ వల్ల సర్వం కోల్పోయిన మహిళలకు ఆర్థిక భరోసా కలుగుతుంది.

– జి.వినీత, కుట్టు శిక్షకురాలు, అచ్యుతాపురం

హోరాహోరీగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాకలో రెండోరోజు గురువారం రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. అనకాపల్లి- పశ్చిమగోదావరి జట్ల మధ్య జరిగిన పోరులో అనకాపల్లి విజయం సాధించింది. విజయనగరం జట్టుపై కృష్ణా గెలిచింది. శ్రీకాకుళం జట్టుతో అనకాపల్లి ఓటమి పాలైంది. ఫ్లడ్ లైట్ల వెలుతురులో రాత్రి పది గంటల వరకు పోటీలు నిర్వహిస్తున్నారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, నిర్వాహకులు ఆడారి గణపతి అచ్చింనాయుడు, కోనపల్లి రామ్మోహనరావు, వేగి కృష్ణ, ఆడారి కాశిబాబు తదితరులు పాల్గొన్నారు.



తలపడుతున్న అనకాపల్లి-గుంటూరు జట్లు

వాలాబు పంచాయతీకి రూ.8.37 కోట్లు

స్పందనకు వందనం

రహదారుల నిర్మాణానికి నిధుల మంజూరు

దేవరాపల్లి, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసినట్లు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. దేవరాపల్లి మండలం వాలాబు గిరిజన పంచాయతీలో రోడ్డు సదుపాయం లేని 8 గ్రామాలకు ఉపాధి హామీ పథకంలో రూ. 8.37 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రోడ్డు సదుపాయం లేక ఈ గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 9న ‘ఎమ్మెల్యే సారూ.. మా కష్టాలు తీర్చరూ‘ శీర్షికన కథనం ప్రచురితమైంది. అదే రోజు ఈ పంచాయతీలో పర్యటించిన ఎమ్మెల్యే ఇంజినీరింగ్ సిబ్బంది, వాలాబు సర్పంచితో రోడ్డు సమస్యపై చర్చించారు. నిధులు మంజూరుకు సంబంధించిన వివరాలను గురువారం సాయంత్రం వెల్లడించారు. కోడాపల్లికి రూ. 87 లక్షలు, రామన్నపాలెంకు రూ. 83 లక్షలు, పూలగరువుకు రూ. 1.07 కోట్లు, బుచ్చంపాలెంకు రూ. 1.2 కోట్లు మంజూరు చేశామన్నారు. బొర్రచింతకు రూ. 87 లక్షలు, కేటీపాలెం మీదుగా గొండుమామిడి వరకు రోడ్డు నిర్మాణానికి రూ. 1.83 కోట్లు, బొడ్డగుమ్మి గ్రామానికి రూ. 1.6 కోట్లు, ఇప్పగరువుకు రూ. 10 లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

దంత వైద్యుడికి టోకరా

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్)లో సిబ్బందికి దంత వైద్యం చేయాలని నమ్మించి వైద్యుడి నుంచి ఆన్‌లైన్‌లో నగదు కాజేసిన ఘటన అనకాపల్లిలో జరిగింది. పట్టణ సీఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. అనకాపల్లికి చెందిన ప్రైవేటు దంత వైద్యుడు బుద్ధ దేవేంద్రకి ఈ నెల 18వ తేదీన అపరిచిత వ్యక్తి నుంచి వాట్సాప్ వీడియో కాల్ వచ్చింది. తాను బీఎస్ఎఫ్‌లో ఉద్యోగినంటూ యూనిఫాంలో మాట్లాడి తమ వద్ద 155 మంది సిబ్బంది ఉన్నారని, వారికి దంత వైద్యం చేయాలని బిల్లులు పెట్టుకుంటే మంజూరు చేస్తామని నమ్మించాడు. దీనికి దేవేంద్ర నిరాకరించారు. నమ్మకం లేకపోతే తన క్రెడిట్ కార్డు వివరాలు ఇస్తానని చెప్పి, వాటి ద్వారా నగదు పంపించి నమ్మకం కలిగించాడు. ఆ తర్వాత వైద్యుడికి ఓటీపీ పంపి, దాని ఆధారంగా బ్యాంకు ఖాతా నుంచి రూ.1.35లక్షల వరకు కాజేశాడు.

జాతీయస్థాయి యోగా పోటీలకు పేట బాలలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: జాతీయస్థాయి యోగా పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థులు ఎంపికయ్యారు. సీబీఎస్ఈ బోర్డు ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు తమిళనాడులోని చెంగల్‌పేట్‌లో సౌత్‌జోన్ (ఏపీ, తెలంగాణా, తమిళనాడు, పాండిచ్చేరి) అండర్-17 యోగా పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో బి.దేవాన్ష్ నాయుడు, జి.సోమసూర్యచరణ్, పి.సోహన్‌శ్రీ, సీహెచ్.జయదీప్, వి.చైతన్య బృందం సత్తా చాటి బంగారుపతకం సాధించారు. వచ్చే నెల 2 నుంచి 5 వరకు సూరత్ (గుజరాత్)లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత పొందారు. గెలుపొందిన విద్యార్థులను సంస్థ అధినేత సీహెచ్‌వీకే. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, యోగా గురువులు సురేష్, జయంతి తదితరులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత నరసింహారావు

మీ ఇంట శుభకార్యం.. బడిలో విందుభోజనం

ఫలితాలిస్తున్న 'శుభదిన్ భోజన్'

రోలుగుంట, న్యూస్‌టుడే

గత పాలకుల్లా అమలు కాని పథకాలు, అనాలోచిత నిర్ణయాలతో కూటమి ప్రభుత్వం ముందుకెళ్లడం లేదు. ఆచితూచి అడుగు లేస్తూ పది మందికి ఉపయోగపడే పథకాలను రూపొందిస్తోంది. వాటిని అమలు చేసే విషయంలో మరింతమందికి ఆదర్శంగా ఉండేలా నిర్ణయాలు తీసుకుంటూ పాలన సాగిస్తోంది. పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన శిక్షా సప్తాహ్‌లో భాగంగా 'శుభదిన్ భోజన్' కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది.

✦ జిల్లాలో 1408 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 78,557 మంది విద్యార్థులు చదువుతున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో మెనూ అమలుతోపాటు కేంద్ర ప్రభుత్వం 'శుభదిన్ భోజన్' పేరుతో దాతలు ఎవరైనా విద్యార్థులకు ఆహార పదార్థాలు, మిఠాయిలు, పండ్లు అందజేసే అవకాశం కల్పించింది. జంక్ ఫుడ్ కాకుండా పోషకాహారం మాత్రమే అనుమతించాలంటూ పాఠశాలలకు మార్గదర్శకాలు జారీ చేసింది. పుట్టిన రోజు, పెళ్లి రోజు సందర్భంగా ఎవరైనా ఆహార పదార్థాలను అందించాలనుకుంటే ముందుగా సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని సంప్రదించాలి. తామేం ఇవ్వాలనుకుంటున్నారో తెలియజేయాలి. ఈ వివరాలను, సంబంధిత చిత్రాలను ప్రధానోపాధ్యాయుడు 'పీఎం పోషణ్' వెబ్‌సైట్లో రిజిస్ట్రేషన్ చేస్తారని మాకవరపాలెం మండల విద్యాశాఖాధికారి పీఎస్ఎన్ మూర్తి చెబుతున్నారు.



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న దాతలు

"రోలుగుంట జడ్పీ పాఠశాల విద్యార్థి మద్దు యవాన్ష్‌నాయుడి జన్మదినం సందర్భంగా అతడి తల్లిదండ్రులు బూరెలు పంచారు. రోలుగుంటకు చెందిన చిత్రాల శ్రీనివాసరావు తన భార్య జ్ఞాపకార్థం జిలేబీ అందజేశారు.

"మాకవరపాలెం మండలం జి.కొత్తూరు పాఠశాల పూర్వ విద్యార్థి సేనాపతి శేషు తన పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజనంలో మిఠాయిలు వడ్డించారు.



ప్రధానోపాధ్యాయుడికి మిఠాయిలు అందజేస్తున్న దాత

పరిశీలించాకే అనుమతిస్తాం



'శుభదిన్ భోజన్' కార్యక్రమాన్ని మొక్కుబడిగా కాకుండా పక్కాగా అమలు చేస్తున్నాం. రోలుగుంట జడ్పీ పాఠశాలలో నాలుగైదుసార్లు నిర్వహించాం. విద్యార్థులకు వడ్డించే ఆహార పదార్థాలను పరిశీలించాలకే అనుమతిస్తున్నాం. వారి ఆరోగ్యానికి హాని చేసే జంక్ ఫుడ్స్ లాంటి వాటికి అనుమతి లేదని ముందుగానే స్పష్టం చేస్తున్నాం. – ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు, రోలుగుంట


అందాల లోకం... తిలకిస్తే స్వర్గం!!

ఈనాడు, విశాఖపట్నం

ఉమ్మడి జిల్లాలో ప్రధాన సందర్శనీయ ప్రాంతాలు..
భీమిలి, తొట్లకొండ, రుషికొండ, ఆర్కే బీచ్, కైలాసగిరి, యారాడ, కొండకర్లఆవ, అనంతగిరి, బొర్రా గుహలు, అరకు, లంబసింగి

విశాఖకు వచ్చే ఇతర రాష్ట్రాల పర్యాటకులు
ఒడిశా, తెలంగాణ, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్, కర్ణాటక

పర్యాటక హోటళ్లలోని గదులు ఇలా..
అప్పూఘర్: 44
మయూరి: 84
అనంతగిరి: 28
టైడా: 26
అరకు వ్యాలీ: 56
లంబసింగి: 11



ఉమ్మడి విశాఖలో పర్యాటక ప్రాంతాల ప్రత్యేకతలెన్నో
'కూటమి' హయాంలో మరిన్ని హంగులు
ఆతిథ్య, రవాణారంగాలకు మళ్లీ ఊపిరి
నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

ఏపీటీడీసీ హోటళ్లు ఉన్న ప్రాంతాలు: 7
మొత్తం గదులు: 249






ఆహ్లాదంగా పర్యాటక హోటళ్లు..

జిల్లాలో ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ హోటళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. గతంలో 304 గదులుండేవి. రుషికొండపై కూల్చివేతల తర్వాత ఆ సంఖ్య 249కి పడిపోయింది. విశాఖ డివిజన్ ఆధ్వర్యంలో పర్యాటక ప్యాకేజీలు నిర్వహిస్తుండగా కొన్నింటికి మంచి డిమాండు ఉంటోంది. కొత్త బస్సులు, కార్లు ఏర్పాటు చేస్తే వీటికి మరింత స్పందన రానుంది.



'గమ్య నగరం'గా పర్యాటకుల మనసుదోచుకున్న విశాఖలో చూడదగ్గ ప్రాంతాలెన్నో.

విశాఖ సాగర తీరం... ప్రాచీన కట్టడాలు... నవీన నిర్మాణాలు... హరితశోభ సంతరించుకున్న సహజసిద్ధ కొండలు... బీచ్ రోడ్డులో సబ్‌మెరైన్, యుద్ధ విమానాలు...ఇలా చెప్పుకుంటూ వెళ్తే ఎన్నో. వీటి ఆధారంగా ఆతిథ్య, రవాణా రంగాలు కొన్ని వేల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. 'కూటమి' ప్రభుత్వం పర్యాటక రంగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న నేపథ్యంలో మరిన్ని సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం నేపథ్యంలో 'ఉమ్మడి విశాఖ'లో ప్రత్యేకతలేంటో చూద్దామా.



✦ గత వైకాపా ప్రభుత్వ హయాంలో పర్యాటకరంగం కుదేలైంది. రుషికొండ హిల్ రిసార్ట్సు కూల్చేయడంతో ఆ శాఖపై తీవ్ర ప్రభావం కనిపించింది. పర్యాటక ఉత్సవాల నిర్వహణ చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక పర్యాటక అనుబంధ రంగాలకు ఊపిరివచ్చినట్లయింది. ప్రభుత్వ విధానాల వల్ల క్రమేణ అన్ని రంగాలు పుంజుకుంటున్నాయి. పర్యాటక ప్రదేశాలకు వస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. కేంద్రం సహకారంతో కొత్తగా బొర్రాను అభివృద్ధి చేయనున్నారు. అరకు-లంబసింగి కారిడార్ పేరుతో బృహత్తర ప్రణాళిక పట్టాలెక్కనుంది.

ఆశాజనకంగా: విశాఖకు వచ్చే సందర్శకుల సంఖ్య క్రమేణ పెరుగుతోంది. పర్యాటకం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెంచితే ఎంతో మార్పు కనిపిస్తుంది. చేతివృత్తులు, ఆహార వంటకాల ద్వారా ప్రోత్సహించొచ్చు. గ్రామీణ ప్రాంతాలను పర్యాటకానికి అనుసంధానం చేయాలి. వారసత్వ ప్రదేశాలను విదేశీయులకు పరిచయం చేయాలి. ఇప్పుడిప్పుడే ఈ రంగం పుంజుకుంటోంది. భవిష్యత్తు ఆశాజనకంగా ఉండనుంది.
– ఎం.వి.పవన్‌కార్తిక్, ఏపీ పర్యాటక సమాఖ్య కార్యదర్శి



నేడు పర్యాటక ప్రాంతాల్లో ఉచిత ప్రవేశం

పపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని వి.ఎం.ఆర్.డి.ఎ. ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు పర్యాటక ప్రాంతాల్లో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు వి.ఎం.ఆర్.డి.ఎ. కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. శుక్రవారం వుడాపార్కు, కైలాసగిరి, డాక్టర్ వై.ఎస్.ఆర్ సెంట్రల్‌పార్కు, తెలుగు మ్యూజియం, సబ్‌మెరైన్, టి.యు.142, సీ హారియర్ మ్యూజియం తదితర సందర్శన ప్రాంతాల్లో ప్రవేశం ఉచితమన్నారు. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల సాయం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం టెక్కలిపాలెంలో రామాలయం నిర్మాణానికి గ్రామానికి చెందిన నూతన్‌నాయుడు రూ.10 లక్షల విరాళాన్ని అందించారు. సుజాతనగర్‌లో ఆయన నివాసంలో గురువారం ఆలయ కమిటీ సభ్యులకు విరాళ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి గొంప సత్యవతమ్మ, నాయనప్ప, ఆలయ కమిటీ సభ్యులు పైల వెంకటరమణ, పంచాడ శ్రీనివాసరావు, పంచాడ దేముడు, కన్నూరు నారాయణమూర్తి, దొగ్గ చిన్నయ్య, యడ్ల అప్పలనాయుడు, బర్ల శ్రీనివాసరావు, యడ్ల నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



రామాలయ కమిటీ సభ్యులకు రూ.10 లక్షల చెక్కు ఇస్తున్న నూతన్‌నాయుడు

వాట్సాప్ గ్రూపు పేరుతో సైబర్ మోసం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: వాట్సాప్ గ్రూపు పెట్టి సభ్యులతో పెట్టుబడులు పెట్టించి అధిక లాభాలు వస్తాయని చెప్పి సైబర్ మోసానికి పాల్పడిన సంఘటనపై అనకాపల్లి పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదుచేశారు. పట్టణ సీఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం. . పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండకు చెందిన గన్నిపూడి వేణుగోపాలకృష్ణ గతంలో అనకాపల్లిలోని ఓ బ్యాంకులో పనిచేసేవారు. ఇతని ఫోన్ నంబరును ఈ ఏడాది ఫిబ్రవరి 27న అపరిచిత వ్యక్తి వాట్సాప్ గ్రూపులో చేర్చాడు. గ్రూపులో 150 మందికి పైగా పెట్టుబడులు పెట్టి లాభాలు పొందారని నమ్మించాడు. నమ్మిన వేణుగోపాలకృష్ణ దఫదఫాలుగా రూ.15 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. అలా చేస్తున్న సమయంలో గ్రూపులోని సభ్యులు ఒకొక్కరు తప్పుకోవడంతో అనుమానం వచ్చి సైబర్ క్రైంకి ఫిర్యాదు చేశాడు. వేణుగోపాలకృష్ణ పంపిన నగదులో రూ.5.35 లక్షలు సైబర్ క్రైం పోలీసులు సీజ్ చేశారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.

తాను చనిపోయి.. మరికొందరికి జీవితాన్నిచ్చి..



విశాఖపట్నం, న్యూస్‌టుడే : ఓ వ్యక్తి మరణిస్తూ మరో ఇద్దరికి కొత్త జీవితం ప్రసాదించాడు. దీనికి సంబంధించి వివరాలు ఉన్నాయి. అనకాపల్లి జిల్లా రావికమతం మండలం, కొత్తకోట గ్రామానికి చెందిన **బి.సంతోష్** (35) తీవ్రమైన తలనొప్పితో ఈనెల 22న రామ్‌నగర్ సెవెన్‌హిల్స్ ఆసుపత్రిలో చేరాడు. తలలో అధికంగా రక్తస్రావం జరిగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. బుధవారం రాత్రి వరకు వైద్యం అందించినా ఫలితం లేకపోవడంతో బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. అవయవదాన సభ్యులు సంతోష్ తండ్రి సత్తిబాబు, సోదరుడు రామకృష్ణకు అవగాహన కల్పించగా.. వారు అవయవదానానికి ఒప్పుకున్నారు. దీంతో హైదరాబాద్ కిమ్స్‌కు ఊపిరితిత్తులు, కేర్ ఆసుపత్రికి కాలేయం కేటాయించి తరలించారు.

సినర్జిన్ ప్రమాద ఘటనపై ఉన్నత స్థాయి కమిటీ ఆరా

పరవాడ, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా పరవాడ జేఎన్ ఫార్మాసిటీలోని సినర్జిన్ ఫార్మా పరిశ్రమలో గతనెల 23న జరిగిన ప్రమాదం ఘటనపై గురువారం ఉన్నత స్థాయి కమిటీ బృందం ఆరా తీసింది. కంపెనీలోని రియాక్టర్ వద్ద జరిగిన ప్రమాదంలో విజయనగరం జిల్లాకు చెందిన కెమిస్టు కె.సూర్యనారాయణతో పాటు ఝార్ఖండ్‌కు చెందిన ఒయబోం కొర్వ, లాల్‌సింగ్‌పూర్త్, రొయా అంగిరియా మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రమాద కారణాలను విశ్లేషణ చేయడానికి ప్రభుత్వం విశ్రాంత ఐఏఎస్ అధికారిణి వసుధ మిశ్రా ఛైర్మన్‌గా వివిధ శాఖల అధికారులు, నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసింది. వారంతా మధ్యాహ్నం 3.30 గంటలకు సినర్జిన్ ఫార్మాకు చేరుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం జరగడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాంకీ కమర్షియల్ హబ్‌లోని సమావేశ మందిరంలో యాజమాన్య ప్రతినిధులు, అధికారులతో సమావేశమయ్యారు. యాజమాన్యాలు కార్మికుల భద్రతకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్, డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చంద్రశేఖర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



రాంకీ కమర్షియల్ హబ్‌లో సమావేశమైన ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు, చిత్రంలో అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్

నిరుద్యోగ యువతకు ఉద్యోగ మేళా నేడు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉద్యోగ మేళా శుక్రవారం ఉదయం పది గంటలకు ప్రభుత్వ పాత ఐటీఐ పక్కన గల నేషనల్ కెరీర్ సర్వీసు సెంటరులో నిర్వహిస్తున్నట్లు సబ్‌రీజనల్ ఎంప్లాయిమెంటు అధికారి ఎన్.శ్యామ్ సుందర్ తెలిపారు. వివిధ సంస్థల్లో ఖాళీగా ఉన్న 250 పోస్టుల భర్తీ జరుగుతుందన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ ఎం, బి,డి, చేసిన అభ్యర్థులు అర్హులన్నారు.

78 కేజీల గంజాయి పట్టివేత



కారుతో పట్టుబడిన గంజాయితో ఎస్సై, సిబ్బంది

కె.కోటపాడు, న్యూస్‌టుడే: కారులో తరలిస్తున్న 78 కేజీల గంజాయిని కె.కోటపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఎస్సై ధనుంజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. కె.కోటపాడు మండలం బత్తివానిపాలెం కూడలిలో వాహన తనిఖీలు చేస్తుండగా ఓ కారులో గంజాయి పట్టుబడిందన్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన జి.దేవానంద్, ఒడిశాకు చెందిన సుఫారి మండల్‌ను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.4 లక్షల వరకు ఉంటుందన్నారు. కారుతోపాటు సెల్‌ఫోన్ సీజ్ చేసి నిందితులను కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్సై చెప్పారు.

ఆరు కేజీలతో ఇద్దరి అరెస్టు

బుచ్చెయ్యపేట: పాడేరు మన్యం నుంచి బుచ్చెయ్యపేట మీదుగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు దిబ్బిడి సమీపంలో గురువారం పోలీసులకు పట్టుబడ్డారు. ఎస్సై శ్రీనివాసరావు కథనం ప్రకారం.. కృష్ణాజిల్లా బంటుమిల్లికి చెందిన డి.వెంకట చరణ్‌సాయి, డి.ఎలీషా శామ్యూల్ బైక్‌పై వస్తుండగా ముందస్తు సమాచారంతో దిబ్బిడి వంతెన అడ్డగించి పోలీసులు తనిఖీ చేశారు. వారి వద్ద ఆరు కేజీల గంజాయి లభ్యం కాగా స్వాధీనం చేసుకుని ఇద్దర్నీ అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై చెప్పారు.

పీవో చొరవతో ఆసుపత్రికి విద్యార్థి తరలింపు

కొయ్యూరు, న్యూస్‌టుడే: ఇంటి వద్ద అనారోగ్యంతోనున్న విద్యార్థిని ఐటీడీఏ పీవో అభిషేక్ చొరవతో ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వారు బయటకు వెళ్లకుండా పోలీసులను కాపలా పెట్టి వారితో తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. డౌనూరు బాలుర ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న కొర్రా సురేష్ వినాయక చవితికి స్వగ్రామం చింతపల్లి మండలం కుడిసింగి వెళ్లాడు. అనారోగ్యం పాలైన విద్యార్థిని కుటుంబసభ్యులు మూఢనమ్మకాలతో ఆసుపత్రికి తీసుకెళ్లలేదు. సురేష్ వసతి గృహానికి రాకపోవడంతో వార్డెన్ విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేయడంతో ఈ విషయం తెలిసింది. ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్‌కు వార్డెన్, హెచ్‌ఎం బుధవారం ఈ విషయాన్ని తెలిపారు. క్రాంతికుమార్ ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లారు. పీవో ఆదేశాలతో హెచ్‌ఎం, ఏటీడబ్ల్యూవో రాత్రి సమయంలో కుంబిడిసింగి వెళ్లి విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడి తాజంగి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడినుంచి నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి మెరుగైన వైద్యసేవల నిమిత్తం తరలించారు. నర్సీపట్నం ఆసుపత్రి నుంచి ఇంటివెళ్లిపోతామని విద్యార్థి తల్లిదండ్రులు అధికారులతో గొడవకు దిగారు. పోలీసుల సహకారంతో బాలుడికి వైద్యసేవలందిస్తున్నారు. నాటు వైద్యం, మూఢనమ్మకాలను నమ్మరాదని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సురేష్ ఆరోగ్యం నిలకడగానే ఉందని క్రాంతికుమార్ తెలిపారు.



విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, పోలీసులు

పిడుగుపాటుకు యువ రైతు దుర్మరణం

దేవరాపల్లి, న్యూస్‌టుడే: పశువులకు మేత తీసుకువచ్చేందుకు పొలం వెళ్లిన యువ రైతు పిడుగుపడి పడి మృతి చెందిన ఘటన దేవరాపల్లి మండలం కొత్తపెంటలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు సూరెడ్డి అప్పలనాయుడు (36) పొలంలో పచ్చగడ్డి కోస్తుండగా సమీపంలో పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పలనాయుడికి భార్య కుమారి, ఏడేళ్ల కుమారుడు వరుణ్ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లేశ్వరరావు చెప్పారు.

తాండవ నదిలో గల్లంతైన యువకుడి మృతి

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మాసాహెబ్‌పేట సమీపాన తాండవనదిలో కొట్టుపోయి గల్లంతైన యువకుడు మృతిచెందాడు. ఇతడి మృతదేహాన్ని పోలీసులు గురువారం గుర్తించారు. సత్యవరం గ్రామానికి చెందిన ఏనుగు శివ మోహన్(25) పొలంలో కూలీ పనికి వెళ్లి నదిపై రైతులు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక వంతెనపై నడిచి వస్తుండగా అదుపు తప్పి నీటిలో పడి గల్లంతైన విషయం తెలిసిందే. పోలీసులు బుధవారం రాత్రి వరకు నదిలో గాలింపు చర్యలు చేపట్టినా దొరకలేదు. మాసాహెబ్‌పేటకు కిలోమీటరు దూరంలో గురువారం నది ఒడ్డుకు కొట్టుకువచ్చిన.శివమోహన్ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. స్వాధీనం చేసుకుని పంచనామా చేసి బంధువులకు అప్పగించినట్లు సీఐ అప్పన్న తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..

లక్ష్మీదేవిపేట(అనకాపల్లి), న్యూస్‌టుడే: కశింకోట రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. దువ్వాడ జీఆర్పీ ఎస్సై లక్ష్మీ అందించిన వివరాలు మేరకు... మృతిచెందిన వ్యక్తి 30 నుంచి 35 ఏళ్ల వయసు ఉంటుంది. 5.3 అడుగుల ఎత్తు ఉన్నాడు. సిమెంట్ కలర్ ఫుల్‌హ్యాండ్స్ షర్ట్, బ్లాక్ కలర్ ఫుల్ హ్యాండ్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మరిన్ని వివరాలకు 73820 58996 నంబరుకి సంప్రదించాలన్నారు.

చికిత్స పొందుతూ ఉక్కు అధికారి..

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు–3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారం స్టీల్ మెల్టింగ్ షాప్(ఎస్ఎంఎస్)-1 ఎల్‌పీ బేలో మంగళవారం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉక్కు అధికారి సీహెచ్.మల్లేశ్వరరావు(54) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. 1992 ఫిబ్రవరిలో సీనియర్ ట్రైనీగా ఉద్యోగ జీవితం ప్రారంభించిన ఆయన... అంచెలంచెలుగా ఎదిగి సీనియర్ మేనేజర్ స్థాయికి చేరుకున్నారు. గాజువాక హైస్కూల్ రోడ్డు జోగవానిపాలెంలో నివాసం ఉంటున్న ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన స్వస్థలం ఉమ్మడి కృష్ణ జిల్లా అనిగళ్లపాడు.

రోడ్డు ప్రమాద మృతులకు అంత్యక్రియలు పూర్తి

నక్కపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ఉద్దండపురం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడిన ఇద్దరు యువకుల మృతదేహాలకు గురువారం శవపరీక్ష పూర్తి చేశారు. మృతదేహాలను సీఐ కె.కుమారస్వామి ఆధ్వర్యంలో రాత్రే నక్కపల్లి ఆసుపత్రికి మృతదేహాలను తరలించారు. వైద్యులు పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారి స్వగ్రామాల్లో మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. ఆసుపత్రి వద్దకు చేరుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు తమ వారి మృతదేహాలు చూసి విలపించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సీతయ్య పరిస్థితి నిలకడగా ఉందని సీఐ తెలిపారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	107	98
లైవ్	129	118
డ్రెస్‌డ్	187	206
స్కిన్‌లెస్	213	216

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా, రామచంద్ర, పరిసాయి, సత్యనారాయణ స్క్రీన్1, వెంకటేశ్వర: **దేవర**
శ్రీ సత్య: **మన్యం ధీరుడు**
సీతారామరాజు సత్యనారాయణ స్క్రీన్2 : **మత్తు వదలరా**
షిర్డిసాయి: **సరిపోదా శనివారం**

ప్రాయశ్చిత దీక్షలు నేటి నుంచి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ప్రాయశ్చిత దీక్షలను విజయవంతం చేయాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేస్తున్న 11 రోజుల దీక్షకు మద్దతుగా మూడు రోజులపాటు అచ్యుతాపురంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ నిర్వహించే దీక్షల్లో అందరూ పాల్గొనాలని కోరారు. దీనికి సంబంధించిన ప్రచారగోడపత్రికను గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆవిష్కరించారు. ఇదే కార్యక్రమానికి సంబంధించి ఎమ్మెల్యే వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోడపత్రికను ఆవిష్కరించారు.

అనకాపల్లి
• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

రెండో విడత శిక్షణ ప్రారంభం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: సెయింట్ గోబైన్ ఆధ్వర్యంలో దిబ్బపాలెం సెజ్ కాలనీలో రెండో విడత టైలరింగ్ శిక్షణ గురువారం ప్రారంభించారు. ఇప్పటికే మొదటి దశలో 300 మంది మహిళలకు ఉచిత శిక్షణ అందించిన సంస్థ.. రెండో దశకు శ్రీకారం చుట్టింది. మొదటిరోజు 30 మంది మహిళలు పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆర్‌ఏసీ ఎల్‌డీ- ఎన్‌జీఓ డైరెక్టర్ జయసెల్వం జ్యోతివెలిగించి ప్రారంభించారు. సమన్వయకర్త నాని, మహిళలు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి శిక్షణ ప్రారంభిస్తున్న రాసిలిడ్ ఎన్‌జీఓ డైరెక్టర్

చితి పేరుస్తున్న చీకటి..

జాతీయ రహదారిపై కూడళ్లలో సెంట్రల్ లైటింగ్ లేక ప్రమాదాలు

జాతీయ రహదారిపై రయ్ మంటూ దూసుకెళ్లే వాహనాలతో ప్రయాణం వేగంగా సాగిపోతుందనుకునే వారికి చీకటి పడే వేళకు నక్కపల్లి మండల పరిధిలోకి రాగానే గుండె గుభేల్‌మంటోంది. ఇక్కడ జాతీయ రహదారిని ఆనుకుని అనేక గ్రామాలుండగా, రోడ్లపై చీకట్లో తరచూ జరిగే ప్రమాదాల్లో అసువులు బాస్తున్నవారి సంఖ్యకు లెక్కేలేదు. గ్రామ కూడళ్లల్లో విద్యుత్తు వెలుగులు లేక ముసురు కుంటున్న చీకటి ప్రజలకు చితి పేరుస్తుంది.

నక్కపల్లి, న్యూస్‌టుడే

చెన్నై - కోల్‌కత్తా 16వ నంబరు నాలుగు వరుసల జాతీయ రహదారిపై జిల్లాలో నక్కపల్లి మండల పరిధే ఎక్కువ. ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు నుంచి పాయకరావుపేట మండలం నామవరం వరకు దాదాపు 17 కిలోమీటర్ల పరిధి ఉంది. దీని నడుమ సారిపల్లిపాలెం, నక్కపల్లి, వెదుళ్లపాలెం, న్యాయంపూడి, కాగిత, చినదొడ్డిగల్లు, వేంపాడు, ఉద్దండపురం, గొడిచెర్ల, ఒడ్డిమెట్ట, చినరామభద్రపురం, దేవవరం కూడళ్లు ఉన్నాయి. ఇందులో ఒకట్రెండు మినహాయిస్తే మిగిలిన చోట్ల నిత్యం రద్దీ ఉంటుంది. ప్రధానంగా నక్కపల్లి, ఉద్దండపురం, వేంపాడు, చినదొడ్డిగల్లు కూడళ్ల వద్ద మరీ ప్రమాదకరంగా ఉంటోంది. రాత్రయితే ఆయా ప్రాంతాల్లో స్థానికంగా ఉండే కొద్దిపాటి పంచాయతీ వీధి దీపాలు, వ్యాపార దుకాణాల లైట్లు వెలుగు మాత్రమే ఉంటుంది. దీంతో వాహనాల రాకపోకలు సాగించినప్పుడు వెలుతురులేమి కారణంగా తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఫలితంగా అనేక మంది ప్రాణాలు కోల్పోతుండగా, ఆయా కుటుంబాల్లో చీకట్లు అలముకుంటున్నాయి. గడిచిన నాలుగేళ్లలో కేవలం నాలుగు గ్రామాల్లోనే జరిగిన ప్రమాదాల్లో 52 మంది మృత్యువాత పడారంటే తీవ్రత ఎలా ఉందో తెలుస్తుంది.



గొబ్బూరు కూడలిలో సోలార్ సెంట్రల్ లైటింగ్

నాలుగేళ్లలో ప్రమాదాల తీరిది (2024 సెప్టెంబరు వరకు)

గ్రామం	మృతులు	క్షతగాత్రులు
ఉద్దండపురం	16	9
ఒడ్డిమెట్ట	11	7
గొడిచెర్ల	11	8
నక్కపల్లి	14	1

వారికి ఇచ్చి.. ఇక్కడ ఆపేసి

జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే కూడళ్లను గుర్తించిన ఎన్‌హెచ్‌ఏఐ కొద్దినెలల క్రితం గొబ్బూరు, కొక్కిరాపల్లి, పులపర్తి, ధర్మవరం ప్రాంతాల్లో సౌర సెంట్రల్ లైటింగ్ పెట్టారు. వీటితో పాటే గుర్తించిన నక్కపల్లి, వెదుళ్లపాలెం, కాగిత, చినదొడ్డిగల్లు, వేంపాడు, ఉద్దండపురం, గొడిచెర్ల, ఒడ్డిమెట్టపై శీతకన్ను వేశారు. మండలంలోని కూడళ్లలో 1.6 కిలోమీటర్ల పరిధిలో 89 సౌర దీపాల ఏర్పాటుకు అధికారులు నిర్ణయిచారు. అయినప్పటికీ ఇంత వరకు ఒక్కటీ పెట్టలేదు.

★ ఇటీవల గణపతి నిమజ్జనంలో పాల్గొని రాత్రి ఇంటికి వచ్చేందుకు రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో మృత్యువాత పడ్డాడు. ప్రమాదం జరగడానికి మూడు వారాల కిందటే ఇతడి భార్య ఓ ఆడ పిల్లకు జన్మనిచ్చింది.

★ తాజాగా బుధవారం రాత్రి ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై వెళుతూ లారీని ఢీకొట్టగా, ఇద్దరు దుర్మరణం చెందారు. వారి కుటుంబాల్లో తీరని వేదన మిగిల్చింది.



రాత్రయితే నక్కపల్లి కూడలి ఇలా..

పై అధికారులకు నివేదిక



జాతీయ రహదారిపై రద్దీగా ఉన్న కూడళ్లలో సాధారణ లైట్లతో వెలుతురు తగినంత లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హెచ్చరిక బోర్డులు పెడుతున్నాం. సెంట్రల్ లైటింగ్ అవసరాన్ని వివరిస్తూ ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం.

– కె.కుమారస్వామి, సీఐ, నక్కపల్లి

త్వరలో ఏర్పాటు

జిల్లాలో తొలివిడత కింద కొన్ని గ్రామాల వద్ద సౌర సెంట్రల్ లైటింగ్ ఉంది. నక్కపల్లి మండలంలో అవసరాన్ని గతంలోనే గుర్తించాం. ఆ మేరకు ఎన్.హెచ్.ఎ.ఐ. అధికారులు సర్వే చేసినప్పుడు పలుచోట్ల దీపాల ఏర్పాటుకు ప్రతిపాదించారు. త్వరలోనే ఈ పనులు మొదలవుతాయి.

– నాగేశ్వరరావు, హైవే నిర్వహణ సంస్థ పీఎం.

వైభవంగా అమ్మవారి జాతరలు

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్తపాలెం, తురంగలపాలెం, రామారాయుడుపాలెం గ్రామాల్లో గురువారం మరిడిమాంబ జాతర వైభవంగా నిర్వహించారు. కొత్తపాలెంలో అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.




కొత్తపాలెంలో ఘటాల ఊరేగింపు

అచ్యుతాపురం, మునగపాక: మూడేళ్లకు ఒకసారి జరిగే ముత్యాలమ్మ పండగను తిమ్మరాజుపేటలో గురువారం నిర్వహించారు. ఆలయం అచ్యుతాపురం తిమ్మరాజుపేట, మండపం మునగపాక తిమ్మరాజుపేట గ్రామాల పరిధిలో ఉండడంతో ఈ పండగను ఆయా గ్రామాల భక్తులు ఉమ్మడిగా జరిపారు. మునగపాక, ఒంపోలు, ఎగువ టి.సిరసపల్లిలో మరిడిమాంబ, దుర్గమాంబ పండగలను ఘనంగా నిర్వహించారు.



తిమ్మరాజుపేటలో ముత్యాలమ్మకు పూజలు



కశింకోట, న్యూస్‌టుడే: కశింకోటలో దుర్గమాంబ పండగ గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు సాయంత్రం ఘటాలతో, డప్పు వాయిద్యాలతో అమ్మవారి పల్లకీని గ్రామంలో ఊరేగించారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ మళ్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

నక్కపల్లి, న్యూస్‌టుడే: గణపతి నవరాత్రి వేడుకల్లో భాగంగా నక్కపల్లి వెంకటనగర కాలనీలో ఏర్పాటు చేసిన స్వామివారి మండపం వద్ద నిర్వాహకులు గురువారం భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. వాఖ్యాతగా వ్యవహరించిన సామాజిక కార్యకర్త నవర నూకరాజుశర్మను కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

అచ్యుతాపురం, పాయకరావుపేట, న్యూస్‌టుడే: రాంబిల్లి తహసీల్దార్‌గా నియమితులైన శ్రీనివాసరావు, అచ్యుతాపురం ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన ప్రభాకరరావు గురువారం అచ్యుతాపురంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పనిచేయాలని అధికారులను ఎమ్మెల్యే కోరారు. పాయకరావుపేట పేట ఎంపీడీఓగా ఎ.ప్రకాశరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. చీడికాడ నుంచి ఈయన బదిలీపై వచ్చారు.

పుస్తకాల పంపిణీ

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: రెండో సెమిస్టర్ పాఠ్య పుస్తకాలను పాఠశాలలకు గురువారం నుంచి పంపిణీ చేస్తున్నామని ఎంఈవో-2 అరుణ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎంఆర్సీ భవనంలో నిల్వ కేంద్రం నుంచి ప్రధానోపాధ్యాయులకు వీటిని అందచేశారు.

ఎలమంచిలి గ్రామీణం: విద్యార్థులు ఎన్ఎన్ఎంఎస్ పరీక్షల్లో రాణించాలని జంపపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శాస్త్రి పేర్కొన్నారు. వింగ్స్ ఫౌండేషన్ ప్రతినిధి ఎం.జయప్రకాష్ ప్రవేశ పరీక్ష పుస్తకాలు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు సత్యనారాయణ, సుబ్బారావు, సుధాకర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత


అచ్యుతాపురం, న్యూస్‌టుడే: మండలంలోని పూడిమడక, కడపాలెం, చిప్పాడ, ఉద్దపాలెం గ్రామాలకు శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్, ఏఈ భానుప్రకాశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

లారీ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై లక్కవరం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై ఉపేంద్ర కథనం ప్రకారం.. కాకినాడ జిల్లా తుని మండలం లోవకొత్తూరుకు చెందిన బి. కృష్ణ కుటుంబంతో కలిసి బొలెరో వాహనంలో ఎలమంచిలి వైపు వస్తున్నారు. మధ్యలో టీ పాయింట్ వద్ద ఆపి మూత్ర విసర్జన కోసం రోడ్డు దాటుతుండగా అటువైపుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

ఎలమంచిలి, మునగపాక, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు రూ. కోట్లు రుణాలుగా అందిస్తోందని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. ఎలమంచిలి పట్టణంలోని డ్వాక్రా సంఘాలకు గురువారం ఆయన చేతులమీదుగా రూ.19.50 కోట్ల రుణాల చెక్కును అందించారు. అనంతరం ధర్మవరంలో డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ బాకూరి ప్రసాదరాజు, కూటమి నాయకులు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, కొఠారు సాంబ, కరణం రవికుమార్, గుర్రాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మునగపాక మండలం తోటాడలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. జగన్ పాలనలో భ్రష్టు పడిన రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. తెదేపా, జనసేన మండల అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురామ్ ఈ కార్యక్రమం జరిగింది. డీఎల్‌డీఓ మంజులవాణి, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ ప్రసాదు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, సర్పంచి దొడ్డి మంగవేణి, ఎంపీటీసీ సభ్యురాలు కాండ్రేగుల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎలమంచిలిలో డ్వాక్రా మహిళలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్



మునగపాక సభలో పాల్గొన్న ప్రజలు

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మండంలోని కొత్తూరు నరసింగరావుపేట సచివాలయంలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిందన్నారు. మాజీ సర్పంచి కసిరెడ్డి సత్యనారాయణ, మహిళలు, కూటమి నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలి

నక్కపల్లి, న్యూస్‌టుడే: లేఅవుట్లు, సొంత స్థలాల్లో వివిధ స్థాయిల్లో నిలిచిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలని ఎంపీడీఓ డి. సీతారామరాజు గృహనిర్మాణ సంస్థ సిబ్బందికి సూచించారు. నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గృహనిర్మాణ సంస్థ ఉద్యోగులతో గురువారం వివిధ శాఖల అధికారులతో కలిసి గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని ఆ మేరకు మన ఇల్లు మన గౌరవం పేరిట కార్యాచరణ చేసిందన్నారు. ఎంఈఓలు కె.నరేశ్, వేమగిరి నూకరాజు, ఏఈలు నాగభూషణం, దుర్గాశంకర్, జగన్, సీడీపీఓ శ్రీలత, ఏపీఓ భాగ్యలక్ష్మి, ఏపీఓ ఉషాదేవి తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

మునగపాక, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి సమాచార హక్కు చట్టం వజ్రాయుధం లాంటిదని లిబ్‌టెక్ ఇండియా ప్రోగ్రాం కోఆర్డినేటరు భీమరశెట్టి కిషోర్ కోరారు. ఆదివాసీ యువతకు మునగపాక ఎంపీడీఓ కార్యాలయంలో అంబేడ్కరిజమే పునాది సంస్థ ఆధ్వర్యంలో గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. రాజ్యాంగ నిబంధనలు, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో క్షేత్ర సందర్శన చేశారు. ఎంపీడీఓ ప్రసాద్‌ను కలసి అనుమానాలను నివృత్తి చేసుకొన్నారు. సంస్థ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు, రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.



ఎంపీడీఓ కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

విద్యార్థుల ప్రతిభ



నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయిని జయలక్ష్మి

మునగపాక, న్యూస్‌టుడే: త్వరలో జరిగే నియోజకవర్గస్థాయి క్రీడా పోటీల్లోనూ రాణించి గణపర్తి ఉన్నత పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి అన్నారు. గణపర్తిలో మూడు రోజులపాటు నిర్వహించిన మండల స్థాయి క్రీడాపోటీల్లో పాఠశాల విద్యార్థులు రాణించారు. కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో ప్రథమస్థానం, ఖోఖోలో జూనియర్స్ విభాగంలో ద్వితీయస్థానంలో నిలిచారు. వీరిని గురువారం ప్రధానోపాధ్యాయురాలు, వ్యాయామోపాధ్యాయుడు నేమాల సత్య శ్రీనివాసరావు, సహోపాధ్యాయులు అభినందించారు.

కోటవురట్లలో మద్యం సీసాల పట్టివేత

కోటవురట్ల, న్యూస్‌టుడే: కోటవురట్లలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన మద్యం సీసాలను పోలీసులు పట్టుకున్నారు. గ్రామస్థులు అందించిన సమాచారం మేరకు పి. మాధవి ఇంట్లో 25 మద్యం సీసాలను పట్టుకుని కేసు నమోదు చేశామని ఏస్సై గంగరాజు తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై రమేష్ హెచ్చరించారు.

నైపుణ్యంతోనే ఉజ్వల భవిష్యత్తు



ఫారడే చిత్రపటం వద్ద స్టీల్‌ప్లాంట్ విశ్రాంత జీఎం రామ్ ప్రసాద్, సిబ్బంది నివాళులు

అనకాపల్లి పట్టణం: విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవడం ద్వారానే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్టీల్‌ప్లాంట్ విశ్రాంత జనరల్ మేనేజర్ డాక్టర్ డి.రామ్ ప్రసాద్ అన్నారు. డైట్ కళాశాలలో మైకేల్ ఫారడే జయంతి ఉత్సవాలను గురువారం నిర్వహించారు. విద్యార్థుల సాంకేతిక పరిశోధనల ఇన్నోవేషన్ ఐడియాస్ 2023-24 పుస్తకాన్ని ఆవిష్కరించారు. లక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగపతి గోపాలమ్మ మైకేల్ ఫారడే ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌కి చేసిన కృషిని వివరించారు. ప్రిన్సిపల్ వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి నియోజకవర్గస్థాయి క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కేఎం నాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్టీఆర్ క్రీడా మైదానం, జీవీఎంసీ పట్టణ ఉన్నత పాఠశాలలో ఈనెల 28, 30వ తేదీల్లో వాలీబాల్, చదరంగం, యోగా, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహిస్తామన్నారు. శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ ముఖ్యఅతిథులుగా హాజరై క్రీడోత్సవాలను ప్రారంభిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 630444980 నెంబరును సంప్రదించాలన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: జగనన్న కాలనీని శ్మశానంగా మార్చిన వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని ఇరువాడకు చెందిన లబ్ధిదారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామ సర్పంచి పిళ్లా సతీష్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 60 మంది లబ్ధిదారులు అచ్యుతాపురం ఎంపీడీఓ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ఇళ్ల స్థలాలు అందించినా కాలనీని శ్మశానంగా మార్చడం అన్యాయమని సర్పంచి పేర్కొన్నారు. ఇన్‌ఛార్జి తహసీల్దార్ నీరజకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు.

కొత్తూరు సాయినగర్‌లో ముంపు తొలగింపు

కొత్తూరు(అనకాపల్లి), న్యూస్‌టుడే: మండలంలోని కొత్తూరులో వర్షపు నీటిలో ఉన్న సాయినగర్ పరిరక్షణ చర్యలు ప్రారంభం అయ్యాయి. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచనలతో సర్పంచి సప్పారపు లక్ష్మి ప్రసన్న, ఉప సర్పంచి అనపర్తి శ్రీనివాసరావు, వార్డు సభ్యులు తాడి శ్రీనివాసరావు, పందల శ్రీనివాసరావు, నీటిపల్లి రాజు, మోసూరి నరసింగరావు, కార్యదర్శి సుభాష్ తదితరులు గురువారం సాయినగర్‌కు చేరుకున్నారు. సాయినగర్‌లో పొక్లెయిన్, ట్రాక్టర్లతో సిబ్బందిని పెట్టి నీటిని తొలగించారు. పూర్తి స్థాయిలో నివారణ చర్యలు పూర్తి చేయడానికి మరో నాలుగు రోజులు పడుతుందని చెప్పారు.



సాయినగర్‌లో పొక్లెయిన్‌తో వ్యర్థాల తొలగింపు పనులు

కోటవురట్ల, నక్కపల్లి, న్యూస్‌టుడే: కోటవురట్ల, నక్కపల్లిలో గురువారం వేకువజాము నుంచి వర్షం కురువడంతో, ప్రధాన రహదారులపై నీరు చేరింది. వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో వినియోగదారులు అవస్థలు చెందారు. దీంతో ఉదయం బడికి, విధులు, ఉపాధి నిమిత్తం వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలి

కశింకోట: కశింకోట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ పరిధిలో కౌలు రైతులకు రుణాలతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. సహకార సంఘంలో గురువారం సంఘ పర్సన్ ఇన్‌ఛార్జ్ బి.రాజేష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో సంఘం రూ.14,02,006 లాభం ఆర్జించిందన్నారు. సంఘ సీఈవో డి.నూకేశ్వరరావు పరిపాలనా నివేదిక చదివి వినిపించగా మహాజనసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. సంఘంలో ఎరువులను విక్రయిస్తామని, సభ్యులు పేర్లను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నందున సభ్యులంతా కేవైసీ వివరాలు సమర్పించాలని తెలిపారు. సభ్యులు శిష్టి రాజు, అగ్గాల పైడిరాజు, పడాల వెంకట పరమేశ్వరరావు, దాసరి శ్రీనివాసరావు మాట్లాడారు..

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి - 80085 74722
ఎలమంచిలి - 80085 74726
పాయకరావుపేట - 80085 74749

అనకాపల్లి పట్టణం,. న్యూస్‌టుడే

?: అనకాపల్లిలో అరటిపండ్లు, కొబ్బరి కాయల మార్కెట్ వద్ద పరిశుభ్రత పనులు చేయడం లేదు. చెత్త పేరుకుపోతుంది.

– రామ్‌కుమార్, అనకాపల్లి

✓: ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

– రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్, అనకాపల్లి జీవీఎంసీ జోన్

మునగపాక, న్యూస్‌టుడే

?: ఉమ్మలాడలో కుళాయిలకు మూతలు లేక తాగునీరంతా వృథాగా పోతుంది. తక్షణమే మూతలు ఏర్పాటు చేయాలి.

– బి. శ్రీనివాసరావు, స్థానికుడు

✓: పంచాయతీ నిధులతో రెండు రోజుల్లో మూతలు ఏర్పాటుచేసి తాగునీటి వృథాను అరికడతాం.

– సూరిశెట్టి గంగయ్యమ్మ, సర్పంచి

సీఎం చంద్రబాబుని కలసిన దాడి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని సచివాలయంలో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఆయన తనయుడు రత్నాకర్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. విజయవాడలో వరద బాధితులను ఆదుకోవడంలో చంద్రబాబునాయుడు కృషిని అభినందించారు. నష్టపోయిన వారికి సకాలంలో నష్టపరిహారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యం

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: విద్యార్థులంతా వ్యక్తిగత శుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వ ఆయుష్ విభాగం ఆయుర్వేద వైద్యులు కె.లావణ్య సూచించారు. పట్టణంలోని భీమునిగుమ్మం డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ ఉన్నత పాఠశాలలో గురువారం ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. యోగా శిక్షకులు ఎం.చంద్రిక, ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు బాషా పాల్గొన్నారు.

నర్సీపట్నం
• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల



లక్ష్మమ్మ కోవెల వద్ద వర్షపు నీటిలో రాకపోకలు

చినుకుపడితే చెరువే..

వర్షం పడితే చోడవరం పట్టణ రహదారులు చెరువులుగా మారుతున్నాయి. కాలువల్లో పూడిక నిండటంతో నీరు పోయే మార్గం లేక రోడ్డుపైనే నిలుస్తోంది. పట్టణంలో గురువారం కురిసిన వర్షానికి లక్ష్మమ్మ కోవెల ఆర్చి ఎదుట మోకాలి లోతున నీరు నిలిచింది. రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. – న్యూస్‌టుడే, చోడవరం

సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంపై ఆందోళన

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: కోమళ్లపూడి గ్రామ సచివాలయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై యువకులు గురువారం ఆందోళనకు దిగారు. సిబ్బంది సరిగా విధులకు హాజరుకావడం లేదని, ఉదయం 11 గంటలైనా సచివాలయం తలుపులు తెరవడం లేదని ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శిని అడిగితే సిగ్నల్స్ రావడం లేదని, వచ్చి ఏం చేయాలంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వాపోయారు. యువకులందరూ చందాలు వేసుకుని సచివాలయంలో ఫైబర్‌నెట్ ఏర్పాటు చేయించినా సిబ్బంది పనిచేయకుండా సాకులు చెబుతున్నారన్నారు. మోటూరి గోవింద, యన్నంశెట్టి సన్యాసినాయుడు, బాలాజీ, గండి చిన్నారి ఆందోళనలో పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: దేవర, మత్తు వదలరా, ఆడి2: ఆడి3: ఆడి4: దేవర, రాజు: బంగార్రాజు: దేవర
చోడవరం: శ్రీసాయిలక్ష్మి: చిన్నకథకాదు, పూర్ణా: సరిపోదా శనివారం సాయిలక్ష్మి: మత్తు వదలరా

గోవాడ గోడు వినరూ..

మహాజన సభ రేపు

చోడవరం, న్యూస్‌టుడే

సహకార రంగంలో నడుస్తున్న ఏకైక చక్కెర కర్మాగారం గోవాడ. కర్మాగారం ఆర్థిక పరిస్థితి ఏటికేడు తీసికట్టుగా మారి మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. చెరకు సరఫరా చేసిన రైతులకు సకాలంలో నగదు జమ చేయడం లేదు. కార్మికులకు వేతన బకాయిలు రూ.కోట్లలో చెల్లించాల్సి ఉంది. ఏడాదికి ఐదు లక్షల టన్నులకుపైగా గానుగాడే సామర్థ్యం ఉన్నా. 2024-25 కు 1.5 లక్షల టన్నుల లక్ష్యంగా పెట్టుకోవడం పరిస్థితికి అద్దం పడుతోంది. చోడవరం కోఆపరేటివ్ సుగర్స్ లిమిటెడ్ మహాజన సభ ఈ నెల 28న మధ్యాహ్నం 2.30 గంటలకు జరగనుంది. చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలతోపాటు అనకాపల్లి ఎంపీ దృష్టిసారించి గోవాడ కర్మాగారానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేయాలని చెరకు రైతులు, కార్మికులు, కార్మిక సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

★ ప్రభుత్వం నుంచి రూ.వంద కోట్లు గ్రాంటుగా తీసుకురావాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని భాజపా ఉమ్మడి జిల్లా పూర్వ అధ్యక్షుడు అన్నాపంతుల రామగోపాల శర్మ పేర్కొన్నారు. 'కర్మాగారంపై 24 వేల మంది రైతులు, వెయ్యిమంది కార్మికుల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేసి చెరకు రైతులను ఆదుకోవాల'ని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి వెంకన్న డిమాండు చేశారు. 'గతేడాది చెరకు సరఫరా చేసిన రైతులకు పూర్తి స్థాయిలో చెల్లింపులు చేయలేదు. ఇంకా టన్నుకు రూ.419 చొప్పున ఇవ్వాల్సి ఉంది. చెల్లిస్తారో, లేదోనన్న అనుమానాలున్నా'యని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు.



చక్కెర కర్మాగారం

టన్నుకు రూ.4 వేలు చెల్లించాలి

చోడవరం, న్యూస్‌టుడే: 'చక్కెర కర్మాగారాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు అక్షయపాత్రగా మార్చుకోవడం వల్లే నేడీ దుస్థితి వచ్చింద'ని రైతు కూలీ సంఘ నాయకులు మండిపడ్డారు. చోడవరంలో సంఘ జిల్లా స్థాయి సమావేశం గురువారం జరిగింది. మృతి చెందిన రైతులకు బీమా, బకాయిలు చెల్లించాలని సమావేశంలో తీర్మానం చేశారు. టన్నుకు రూ.4 వేల చొప్పున చెల్లించాలని డిమాండు చేశారు. కర్మాగారంలో గత పదేళ్లలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలన్నారు. సంఘ జిల్లా కార్యదర్శి కోన మోహనరావు, బేరా జగదీశ్వరరావు, గొర్లె రాజు, అయితిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.



రైతు కూలీ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న మోహన్

ఈ-పంట నమోదుకు రారండోయ్!

ఉచిత పంటల బీమా, రాయితీలు వర్తింపు

రావికమతం, న్యూస్‌టుడే

ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతుంటారు. ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంటతోపాటుగా పెట్టుబడులనూ కోల్పోవాల్సి వస్తోంది. ప్రభుత్వం అందించే నష్టపరిహారం కోసం ఆశగా ఎదురు చూడాల్సిన పరిస్థితి. సాగును ప్రోత్సహించడంతోపాటు రైతులకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ-పంట నమోదును ప్రవేశపెట్టింది. నమోదు చేయించుకున్న వారందరికీ ఖరీఫ్ సీజన్‌లో ఉచిత పంటల బీమా వర్తింపజేస్తోంది. రావికమతం మండలంలో ఈ పంట నమోదు మందకొడిగా సాగుతోంది.

నెలాఖరు వరకు గడువు

రైతు సేవా కేంద్రాలు (ఆర్‌బీకే)కు వెళ్లి పంట వివరాలు నమోదు చేయించుకోవాలి. సాగు చేసిన పంట రకం, విస్తీర్ణం, సర్వే నంబరు, పట్టాదారు పాసు పుస్తకం వివరాలు తెలియజేయాలి. అనంతరం రైతు సేవా కేంద్రం వ్యవసాయ అసిస్టెంట్లు రైతు పొలానికి వెళ్లి పంట నమోదు కార్యక్రమం పూర్తి చేస్తారు. ఆ వెంటనే ఈ-పంట నమోదైనట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. దీని ద్వారానే రైతులు పంట నష్టపరిహారం పొందేందుకు వీలవుతుంది. నష్టపరిహారం రాకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రశ్నించవచ్చు. ఈ-పంట నమోదుకు ఈ నెల 15తో ముగిసినప్పటికీ నెలాఖరు వరకు పొడిగించారు.



ఈ-పంట నమోదు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

వర్షాధారంగానే..

జిల్లాలో వర్షాధారంగా పంటలు పండే మండలాల్లో రావికమతం ఒకటి. వర్షాలు కురిసి చెరువులు నిండితేనే పొలాలకు సాగునీరందుతుంది. వ్యవసాయ, ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం 10,250 ఎకరాలు. ఖరీఫ్ సీజన్‌లో వరి సాధారణ విస్తీర్ణం 4,982 ఎకరాలు. ఒకప్పుడు ఆరు వేల ఎకరాలకుపైగా సాగయ్యేది. క్రమేణా తగ్గుతూ వస్తోంది. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండటంతో 5,893.49 ఎకరాల్లో సాగు చేశారు. చెరకు సాధారణ విస్తీర్ణం 3,915 ఎకరాలు కాగా ఈ ఏడాది 1,063 ఎకరాల్లోనే సాగైంది. 10,400 మంది రైతులకు ఇప్పటివరకు ఈ-పంట నమోదు చేయించుకుంది 8,320 మందే. ఇంకా 2,080 మంది నమోదు చేయించుకోవాల్సి ఉందని వ్యవసాయాధికారిణి రూప చెప్పారు.

అ వీ ఇ వీ

ఉపాధి హామీ ప్రజావేదిక నేడు

రోలుగుంట, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీఓ కె.సూర్యమణి చెప్పారు. గతేడాది ఏప్రిల్ నెల నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు చేసిన పనులపై ఇప్పటికే గ్రామాల వారీగా సిబ్బంది పరిశీలన చేసి కూలీల నుంచి అభ్యంతరాలను స్వీకరించారన్నారు.

తహసీల్దార్‌గా ప్రసాదరావు

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ తహసీల్దార్‌గా వైఎస్‌వీవీ ప్రసాదరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి కలెక్టరేట్‌లో ఓఎస్‌డీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన బి.వి.రాణి కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. ఉప తహసీల్దార్ రమేశ్, సిబ్బంది ప్రసాదరావుకు సాదర స్వాగతం పలికారు.

పంపిణీకి దోమతెరలు సిద్ధం

నాతవరం, న్యూస్‌టుడే: గిరిజన ఉప ప్రణాళిక అమలులో భాగంగా దోమతెరల పంపిణీకి చర్యలు చేపట్టామని ఎంపీడీవో పార్థసారథి చెప్పారు. సరుగుడు, కె.వి.శరభవరం, చమ్మచింత, మాధవనగరం గ్రామాల్లో గిరిజనులకు పంపిణీ చేసేందుకు 2502 దోమతెరలు పాడేరు ఐటీడీఏ నుంచి గురువారం వచ్చాయన్నారు.

ప్రేమ సమాజానికి వితరణ

చోడవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రేమ సమాజంలో చిన్నారులు, వృద్ధులకు ఆరోగ్య శాఖ విశ్రాంత అధికారి దేవరకొండ సుబ్బారావు గురువారం దుస్తులు, స్టీల్ డబ్బాలను వితరణగా ఇచ్చారు. అనంతరం విందు భోజనం ఏర్పాటు చేశారు. ప్రేమ సమాజం అధ్యక్షుడు పూసర్ల రామారావు, వింజమూరి శేషమణి, రామకృష్ణ, వీరవెంకట రమణి, అక్కినపల్లి వెంకట జగన్నాథరావు, దేవరపల్లి వీరరామ భాస్కరఫణి, నవకుమార్, పనసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ న్యాయవాదికి వీడ్కోలు

చోడవరం, న్యూస్‌టుడే: స్థానిక అదనపు జిల్లా మేజిస్ట్రేట్ కోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా ఉన్న ఎన్.శంకరరావుకు గురువారం సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈయన బదిలీపై విశాఖ జిల్లా కోర్టుకు వెళ్తున్నారు. శంకరరావు స్థానంలో హరిప్రియ నియమితులయ్యారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డేవిడ్, చీపురుపల్లి సూర్యనారాయణ, పీవీ రమణమూర్తి, భవానీశంకర్, సాంబశివరావు పాల్గొన్నారు.

వేతన చెల్లింపుల్లో ఆలస్యం తగదు

గొలుగొండ, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులకు వేతనాల చెల్లింపు ఆలస్యమవుతుందని సంఘ కార్యదర్శి చుక్కల సత్యనారాయణ పేర్కొన్నారు. మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద సంఘ సభ్యులతో కలిసి గురువారం నిరసన తెలిపారు. శాశ్వత ఉద్యోగులకు ఇచ్చినట్లే ఒకటో తేదీనే చెల్లించాలని కోరారు. సత్యనారాయణ, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాల్ సేవలు అమూల్యం

నాతవరం, న్యూస్‌టుడే: దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమం నాతవరంలో ఘనంగా నిర్వహించారు. భాజపా నాయకులు యర్రా సూరిబాబు తదితరులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దీనదయాల్ సేవలను కొనియాడారు. భాజపా అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: ఏఎల్‌పురంలో మద్యం దుకాణం నుంచి అక్రమతంగా తరలిస్తున్న ఏడు మద్యం సీసాలను కొంగశింగి కూడలిలో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై దివ్య చెప్పారు. గొలుసు దుకాణాలు నిర్వహించినా, గంజాయి, ఇసుక అక్రమ రవాణా చేసినట్లు తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

జూద శిబిరంపై దాడి

నాతవరం: పెదజగ్గంపేట శివారంలో రహస్యంగా నిర్వహిస్తున్న జూద శిబిరంపై నాతవరం పోలీసులు దాడి చేశారు. ఎనిమిదిని అదుపులోకి తీసుకుని రూ.8500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై భీమరాజు చెప్పారు.

ఆసుపత్రిలో పడకల సంఖ్య పెంచుతాం

'ఇది మంచి ప్రభుత్వం'లో ఎమ్మెల్యే రాజు

చోడవరం, న్యూస్‌టుడే: ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వేసి వైద్య సేవల మెరుగుకు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు చెప్పారు. ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేసి పడకల సంఖ్యను 50కి పెంచుతామన్నారు. ప్రభుత్వ వైద్యులు ప్రైవేటు ప్రాక్టీసు చేయడం తగదని సూచించారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా చోడవరంలో గురువారం ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అంటించారు. 'మీ ఇంటికి మీ ఎమ్మెల్యే' కార్యక్రమం త్వరలోనే చేపట్టనున్నట్లు ప్రకటించారు.

ఇద్దరిదీ అవినాభవ సంబంధం

'నేను సర్పంచిగా ఉన్నపుడు ఆయన చోడవరం పంచాయతీ కార్యనిర్వహణాధికారి (ఈవో). ఎంపీపీగా పదవీ చేపట్టినప్పుడు ఈవోఆర్‌డీ. ఎమ్మెల్యే అయ్యాక మండల పరిషత్తు అభివృద్ధి అధికారిగా వచ్చారు. మా ఇద్దరిది అవినాభవ సంబంధమ'ంటూ ఎంపీడీఓ పీవీఎస్ఎన్ ఆంజనేయులును ఉద్దేశించి ఎమ్మెల్యే రాజు వ్యాఖ్యానించారు. పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీడీఓ ఆంజనేయులు అధ్యక్షత వహించారు. సమావేశం జరుగుతుండగా ఎంపీపీ కాసు రాగా.. ఆమెను ఎమ్మెల్యే రాజు వేదికపై ఆహ్వానించారు. 'ఎన్నికల్లో మీరు సహకరించారు.. ఇప్పుడు మేము సహకరిస్తా'మనడంతో వైకాపాకు చెందిన ఎంపీపీ కాసు, సర్పంచి నూకాలమ్మతోపాటు అందరూ నవ్వులు చిందించారు.



దుర్గావిలాస్ సందులో ఓ ఇంటి గోడకు స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్యే రాజు

రేపట్నుంచి 'మన ఇల్లు.. మన గౌరవం'

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: గృహ నిర్మాణ లబ్ధిదారులకు 'మన ఇల్లు.. మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 28 నుంచి అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. దీనిపై మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ విజయలక్ష్మి, హౌసింగ్ ఏఈ రామచంద్రరావు సిబ్బందితో సమావేశమయ్యారు. 2025 మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

మాకవరపాలెం, న్యూస్‌టుడే: జగనన్న కాలనీల్లో స్థలాలు పొందిన లబ్ధిదారులు డిసెంబరులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు చర్యలు చేపట్టాలని ఇన్‌ఛార్జి ఎంపీడీఓ సీతామహాలక్ష్మి ఆదేశించారు. మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం ఇంజినీరు సహాయకులతో సమావేశమయ్యారు.

అడుసులో అడుగులేస్తూ బడిబాట!

ఆరిలోవ అటవీ ప్రాంతానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గిరిజన గ్రామం డొంకాడ దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోలేదు. కొండగెడ్డలు పొంగితే బాహ్య ప్రపంచంతో సంబంధాలుండవు. తారురోడ్డు నిర్మిస్తామన్న హామీని వైకాపా ప్రభుత్వం అటకెక్కించింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దారంతా చిత్తడిగా మారింది. గ్రామానికి చెందిన విద్యార్థులు బురద దారిలోనే అడుగులేస్తూ సమీపంలోని జిల్లేడుపూడి పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం దృష్టిసారించి రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గొలుగొండ



రామచంద్రపాలెంలో తాగునీటికి ఇక్కట్లు

గొలుగొండ, కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: లింగంపేట శివారు రామచంద్రపాలెంలో మూడు రోజులుగా గ్రామస్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు ఖాళీ బిందెలతో గురువారం నిరసన తెలిపారు. గ్రామంలో ఐదు వేల లీటర్ల సామర్థ్యంతో సోలార్ తాగునీటి పథకం, రెండు బోర్లున్నాయి. సోలార్ పథకం పని చేయడం లేదని, చేతి పంపుల నుంచి నీరు బురద రంగులో వస్తోందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



తాగునీటి పథకం వద్ద ఖాళీ బిందెలతో మహిళలు

ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా ర్యాలీ

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగంపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా కూటమి నాయకులు గురువారం ర్యాలీ చేశారు. జనసేన పార్టీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాయపురెడ్డి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. హిందువులంతా కలిసికట్టుగా ఉండాలని, ఆలయాలపై దాడులను అరికట్టాలని నినాదాలు చేస్తూ మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం బస్టాండు కూడలి నుంచి కాలినడకన వేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. 108 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. అప్పలరాజు, రామకొండలరావు, సుబ్బలక్ష్మి, గంగయ్య, రాజు, శివాజీ, అచ్యుతరావు, శ్రీరామ్మూర్తి, రంజిత్‌వర్మ, రమేష్, కాశిబాబు, ఈశ్వరరావు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న కూటమి నాయకులు

తారు రోడ్డు ప్రారంభం

జాలంపల్లి పంచాయతీలో ఎల్.కృష్ణాపురం నుంచి కామకూటం మీదుగా కొండవీధి వరకు కొత్తగా నిర్మించిన తారు రోడ్డును ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి గురువారం ప్రారంభించారు. అనంతరం ఎల్.పొన్నవోలులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీపీ రాజారాం, ఒమ్మలి సర్పంచి సింహాచలంనాయుడు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నాయకులు రమేష్, దేముడు, శ్రీను, సన్యాసిరావు, రంజిత్ వర్మ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

చీడికాడ: చీడికాడ ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సతీశ్‌ను జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాయపురెడ్డి కృష్ణ, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.

విద్యుత్తు సదుపాయం కల్పించాలి

రావికమతం, న్యూస్‌టుడే: చీమలపాడు శివారు జీలుగులోవ, సోంపురం, బంద గ్రామాలకు విద్యుత్తు సదుపాయం కల్పించాలని డిమాండు చేస్తూ గిరిజన మహిళలు గురువారం ఆందోళన చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు మాట్లాడుతూ.. జన్‌మన్ పథకంలో ఉచితంగా విద్యుత్తు కనెక్షన్లు ఇస్తామంటే రెండు నెలల కిందట ఈపీడీసీఎల్ రావికమతం ఏఈకి దరఖాస్తులు అందజేశామన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు అందజేసినా ఇప్పటివరకు కనెక్షన్లు ఇవ్వలేదని చెప్పారు. సోమవారంలోగా అధికారులు స్పందించకపోతే నర్సీపట్నంలో డీఈ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామన్నారు. వాసు, రాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.22.4 లక్షల పరిహారం మంజూరు



గుమ్మళ్లపాడు రైతుకు దాణా, మందులు అందిస్తున్న సర్పంచి, పశువైద్యాధికారులు

చీడికాడ, మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో మృతి చెందిన పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లకు రూ.22.4 లక్షల పరిహారాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందని పశు సంవర్ధక శాఖ పాడేరు డివిజన్ ఉప సంచాలకులు నరసింహులు తెలిపారు. మాడుగుల, చీడికాడ, ఖండివరం పశువైద్యశాలలు, చుక్కపల్లి రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. చీడికాడ, మాడుగుల మండలాల్లో పశువులకు టీకాలు వేసే కార్యక్రమం వివరాలు తెలుసుకున్నారు. గోకులం షెడ్లకు దరఖాస్తులు ఎన్ని వచ్చాయని ఆరా తీశారు. పశు వైద్యాధికారులు చిట్టినాయుడు, గాయత్రిదేవి, గణేశ్, సిబ్బంది సౌజన్య, దేముడు పాల్గొన్నారు.

పశువుల మేతలో మార్పులపై సూచనలు

రావికమతం, న్యూస్‌టుడే: పశు గణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ సంయుక్తంగా గుమ్మళ్లపాడులో గురువారం పశు వైద్య శిబిరం, పాడి రైతుల సదస్సు నిర్వహించాయి. రావికమతం, కోటవురట్ల ఏడీఏలు పుష్ప, నరేష్, వైద్యులు సురేష్, బాలతేజ, మణిలక్ష్మణ్, జాహ్నవి పశువులకు గర్భకోశ పరీక్షలు, సాధారణ చికిత్సలు, చిన్నపాటి శస్త్రచికిత్సలు చేశారు. పశువుల మేతలో చేయాల్సిన మార్పులపై ఏడీఏ నరేష్ రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచి సన్యాసినాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, సిబ్బంది దేముడు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న నరసింహులు

పచ్చదనం పెంపునకు చర్యలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: మండల విద్యాశాఖాధికారి కార్యాలయ ప్రాంగణంలో పచ్చదనం పెంపునకు ఏపీటీఎఫ్ నాయకులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కడియం నర్సరీ నుంచి మొక్కలు తెప్పించి గురువారం నాటారు. సంఘ జిల్లా కౌన్సిలర్ శ్రీనివాస్, ఎంఈఓలు తలుపులు, నాగేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎంఈఓలు తలుపులు, నాగన్న

బుచ్చెయ్యపేట: స్వచ్ఛతే సేవ పక్షోత్సవాల్లో భాగంగా వడ్డాదిలో ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటారు. సర్పంచి కామలక్ష్మి, పంచాయతీ ఈఓ లోవరాజు, వైస్ ఎంపీపీ దొండా లలిత, నారాయణమూర్తి, నరేష్, సూరి అప్పారావు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిద్దాం

నర్సీపట్నం, న్యూస్‌టుడే: చదువుతోపాటు క్రీడల్లో రాణించే విద్యార్థులను ప్రోత్సహిద్దామని ఉపాధ్యాయుడు కె.వి.శేషయ్య అన్నారు. స్థానిక పీబీఎం జడ్పీ పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఆయన గురువారం పది మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గువాహటిలో జరిగిన జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో స్వర్ణపతకం సాధించిన అల్లూరి సీతారామరాజు డిగ్రీ కళాశాల విద్యార్థిని బొంతు మౌనికను ప్రిన్సిపల్ రాజు, వెలగా నారాయణరావు సత్కరించి బాక్సింగ్ కిట్టు అందజేశారు.



మౌనికను సత్కరిస్తున్న రాజు, నారాయణరావు

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

దేవరాపల్లి, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై సామాజిక బృందం తనిఖీలు పూర్తి చేసింది. వీటి వివరాలను మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రజావేదికలో వెల్లడించారు. 27 పంచాయతీల్లో జరిగిన పనుల్లో లోపాలపై ఏపీడీ రోజారాణి సిబ్బంది నుంచి వివరణ తీసుకున్నారు. ఎంపీపీ బుల్లిలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు సత్యం, ఉపాధి హామీ పథకం కౌన్సిలర్ బాబూరావు, విజిలెన్సు అధికారిణి నిర్మలాదేవి, ఏపీడీ శ్రీనివాస్, ఎంపీడీఓ సువర్ణరాజు, ఎస్ఆర్పీ రాజేంద్ర, ఏపీఓ చంద్రకళ పాల్గొన్నారు.

రోలుగుంట, న్యూస్‌టుడే

మేమున్నాం.. మీకు తోడుగా

?: హైస్కూలు పక్కగా ఉన్న సీసీ రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగాయి. రోజూ మహిళలు కొండ మీద బావి నుంచి తాగునీటిని తెచ్చుకుంటుంటారు. తుప్పల్లోంచి పాములు వస్తుండటంతో వారంతా భయపడుతున్నారు. – బి.సురేష్, రోలుగుంట

✔: సమస్య మా దృష్టికొచ్చింది. రెండు రోజుల్లో తుప్పలను తొలగిస్తాం. – రవికిరణ్, పంచాయతీ కార్యదర్శి

నర్సీపట్నం - 80085 74743
చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74737

బోరు నీరు ఎర్రగా..

రావికమతం, న్యూస్‌టుడే: కొమిర ఎస్సీ కాలనీలో చేతి బోరు నుంచి నీరు ఎర్రగా వస్తోంది. కొద్దిరోజుల కిందట బోరు నుంచి నీరు రాకపోవడంతో గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం సిబ్బంది మెకానిక్‌ను తీసుకువచ్చి మరమ్మతు చేయించారు. బోరు లోపల పైపులకు రంధ్రాలు పడటంతో వాటిని తొలగించి కొత్తవి వేశారు. కొత్త పైపులు చాలకపోవడంతో పాత వాటిలో బాగున్న వాటిని వాడారు. ఉదయాన్నే బోరును కొడితే ఎర్రగా నీరు వస్తోందని మహిళలు చెబుతున్నారు. ఈ నీటిని తాగాలంటే భయమేస్తోందని వాపోతున్నారు.

బండరాళ్ల లారీ బోల్తా.. ఇద్దరికి గాయాలు

మాకవరపాలెం: సుభద్రయ్యపాలెం నల్లరాయి క్వారీ నుంచి బండరాళ్లతో వస్తున్న లారీ గురువారం మధ్యాహ్నం ప్రమాదానికి గురైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారి పక్కన మట్టి కొట్టుకుపోవడంతో జి.వెంకటాపురం సమీపంలో లారీ అదుపుతప్పి పడిపోయింది. డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు.



ప్రమాదానికి గురైన లారీ

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

చీడికాడ, న్యూస్‌టుడే: సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో చీడికాడ మండలంలోని ఉన్నత పాఠశాలల్లో గురువారం వ్యాసరచన పోటీలు జరిగాయి. ఎనిమిది నుంచి పదో తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 27న ఇంటర్, డిప్లమో, 30న డిగ్రీ, బీటెక్ విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తామని సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు లక్ష్మణనాయుడు, కృష్ణ తెలిపారు. మండల స్థాయిలో అక్టోబరు 10న, జిల్లా స్థాయిలో 15న, రాష్ట్రస్థాయిలో నవంబరు 5న ఫలితాలు ప్రకటిస్తామన్నారు.

మాడుగుల గ్రామీణం: మాడుగుల సమితి ఆధ్వర్యంలో 'భగవంతుడు ఒక్కడే నిజమైన స్నేహితుడు' అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. మండలంలోని 11 జడ్పీ పాఠశాలల నుంచి 199 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మండల ఇన్‌ఛార్జి పి.బలరాం, కన్వీనర్ కె.శ్రీను, సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

గొలుగొండ, న్యూస్‌టుడే: కొంగసింగి ప్రభుత్వ పాఠశాలలో సత్యసాయి సేవా సంస్థ సభ్యులు విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'తల్లిదండ్రులపై ప్రేమ, దైవ చింతనతో వచ్చే ప్రశాంతత' అంశాలపై పోటీ పెట్టినట్లు సభ్యులు సత్యనారాయణ, శ్రీనివాసరావు చెప్పారు.



చీడికాడలో పాఠశాలలో వ్యాసరచన పోటీకి హాజరైన విద్యార్థులు

నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నేటి నుంచి..

కె.కోటపాడు, న్యూస్‌టుడే: నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు చౌడువాడ జడ్పీ పాఠశాలలో శుక్రవారం నుంచి జరగనున్నాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించనున్నారు. మాడుగుల, చీడికాడ, కె.కోటపాడు, దేవరాపల్లి మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నారు.

పెందుర్తి

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
స్క్రీన్-1 - దేవర (5 ఆటలు)
స్క్రీన్-2 - దేవర (5 ఆటలు)



మర్యాద పూర్వక కలయిక

పెందుర్తి, న్యూస్‌టుడే: విశాఖ పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పర్యటన అనంతరం తిరుగు ప్రయాణంలో విమానాశ్రయంలో లోకేశ్‌ను కలిసి శాలువతో సత్కరించారు.

అందుబాటులోకి కల్యాణ మండపం



నరవలోని కల్యాణ మండపం

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత పంచాయతీ పాలనను పక్కకు పెట్టి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. సచివాలయాల కోసం కల్యాణ మండపాలు, సామాజిక భవనాలను వినియోగించుకున్నారు. దీంతో ప్రజలు శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం గెలవడంతో ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరిస్తున్నారు. శుభ కార్యక్రమాలకు దూరమైన నరవ కల్యాణ మండపం ఎట్టకేలకు మళ్లీ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు చొరవతో కల్యాణ మండపంలో ఉన్న సచివాలయాన్ని గురువారం అద్దె భవనంలోకి మార్చి కల్యాణ మండపాన్ని ప్రజలకు అంకితం చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన సచివాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. నరవతో పాటు సుమారు మరో 10 గ్రామాల ప్రజలు ఈ కల్యాణ మండపాన్ని వినియోగించుకునేవారు. స్థానికులు, వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు ఎన్నిమార్లు వ్యతిరేకించినా దాన్ని మార్చలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత స్థానిక నాయకులు ఎమ్మెల్యే పంచకర్ల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. వెంటనే సచివాలయాన్ని వేరొక భవనంలోకి మార్చి కల్యాణ మండపాన్ని ప్రజలకు అందజేయాలని జీవీఎంసీ కమిషనరుకు సూచించారు. ఎమ్మెల్యే సూచనలతో కమిషనరు చర్యలు తీసుకున్నారు. ఎట్టకేలకు కల్యాణ మండపానికి పట్టిన గ్రహణం వీడటంతో కూటమి నాయకులు, నరవ ప్రజలు సంబరాలు చేసుకున్నారు. అదేవిధంగా నరవ పాత పంచాయతీ భవనం ఉన్న స్థలంలో శాశ్వత సచివాలయం భవనం నిర్మించే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

చేయి చేయి కలిపారు... విరాళాలు సేకరించారు..

వేపగుంట, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలకు బుడమేరు పొంగి విజయవాడ ముంపునకు గురై సర్వం కోల్పోయిన బాధితులకు సహాయం చేయడంలో మేముసైతం అంటూ ముందుకొచ్చారు జీవీఎంసీ జోన్-8 పరిధిలోని 94వ వార్డు డ్వాక్రా సంఘాల మహిళలు. తమవంతు సాయం అందించడంతో పాటు ఇరుగుపొరుగు వారితో కూడా సాయం అందించేలా చేశారు. ఇంటింటికీ తిరిగి విరాళాలు సేకరించి తమలోని మానవత్వాన్ని చాటుకున్నారు. 94వ వార్డు జనసేన అధ్యక్షురాలు పిన్నింటి పార్వతి, హేమ లక్ష్మి, నామాలా అరుణ విరాళాలు సేకరించి వరద బాధితులకు అందించాలని సంకల్పించారు. యూసీడీతో సంబంధం లేకుండా వీరు తమకు తెలిసిన మహిళలు అందరికీ ఈ విషయాన్ని చరవాణి ద్వారా సందేశం పంపించారు. వెంటనే మహిళలు స్పందించి ఎవరికి తోచిన సహాయాన్ని వారు అందించారు. ఖాళీ సమయాల్లో ఇళ్ల వద్దకు వెళ్లి నిధులు సేకరించారు. అలా కూడబెట్టిన మొత్తం రూ.1.66 లక్షలు సమకూరాయి. ఈ నగదును చెక్కుగా మార్చి గురువారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబుకు అందజేసి ముఖ్యమంత్రి సహాయనిధికి పంపించాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి బాధితులకు సహాయం చేయడానికి ముందుకొచ్చిన మహిళలందరినీ ఆయన అభినందించారు.



సేకరించిన విరాళాల చెక్కుతో డ్వాక్రా మహిళలు

– న్యూస్‌టుడే, చినముషిడివాడ (పెందుర్తి)

సమస్య: జీవీఎంసీ 97వ వార్డు పరిధి చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లో 12బి/1/7, 12బి/1/8, 12బి/1/9, చినముషిడివాడ క్రాంతినగర్‌లో 7ఎ/12, సిద్ధార్థనగర్‌లో 354బి/4 స్తంభాలకు ఉన్న ఉన్న వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో కాలనీల్లో అంధకారం నెలకొంటోంది.
– జాహ్నవి, శ్రమశక్తినగర్, వెంకటరమణమ్మ, క్రాంతినగర్, ఎస్.వెంకటరమణ, సిద్ధార్థనగర్

సమాధానం: మీ ప్రాంతాల్లో వెలగని వీధి దీపాలకు త్వరలోనే మరమ్మతు చేయించి వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
– శివ రామ్‌ప్రసాద్, ఏఈ, 97వ వార్డు

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

సమస్య: సబ్బవరం సాయినగర్ నుంచి కళాకారుల కాలనీకి వెళ్లే రహదారి దారుణంగా ఉంది. కాలనీ ఏర్పడి 30 ఏళ్లు అవుతున్నా నేటికీ రోడ్లు నిర్మించలేదు. వర్షాకాలంలో బురదతో నానా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి రహదారి నిర్మించాలి.
– ఎం.సూరిబాబు, కళాకారుల కాలనీ

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. రహదారి నిర్మాణానికి చర్యలు చేపడతాం.
– డి.ప్రసాదరావు, సర్పంచి, సబ్బవరం



తానాంలో అన్నసమారాధనను ప్రారంభిస్తున్న మాజీ జెడ్పీటీసీ జగన్నాథరావు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ వెంకటరమణ

భారీ అన్నసమారాధనలు

పరవాడ, న్యూస్‌టుడే: వినాయక ఉత్సవాల్లో భాగంగా పరవాడ మండలం తానాంలో గురువారం రామాలయం యూత్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పైలా జగన్నాథరావు, అనకాపల్లి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కన్నూరు వెంకటరమణ ప్రారంభించారు. స్థానికులు పెద్దఎత్తున చేరుకుని అన్నదానం స్వీకరించారు. వర్రి వసంతరావు, రామాలయం యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం గోపాల్‌నగర్‌లో భారీ అన్నసమారాధన జరిపారు. సీఐ పిన్నింటి రమణ భోజనాలు వడ్డించి అన్నసమారాధనను ప్రారంభించారు. పరిసర గ్రామాల నుంచి సుమారు 3 వేల మంది భక్తులు హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. స్థానిక నేతలు కోరాడ శ్రీనివాసరావు, పల్ల తాతారావు, పి.రమణ, కోన సోమేశ్వరరావు, కొయ్యి రమణ, పల్ల సన్యాసిరావు, నిర్వాహకులు పాల్గొన్నారు.



సబ్బవరం గోపాల్‌నగర్‌లో భోజనాలు వడ్డిస్తున్న సీఐ పిన్నింటి రమణ, నిర్వాహకులు

భక్తుల మనోభావాలను కాపాడేందుకే దీక్ష



సంఘీభావ దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, కూటమి నాయకులు

పురుషోత్తపురం(పెందుర్తి), న్యూస్‌టుడే: తిరుమలలో జరిగిన అపచారం నేపథ్యంలో భక్తుల మనోభావాలను కాపాడేందుకే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. పవన్‌కల్యాణ్ దీక్షకు మద్దతుగా జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద స్థానిక జనసేన నాయకుడు ఉరిటి లక్కీగోవింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంఘీభావ దీక్షలో పంచకర్ల పాల్గొన్నారు. కార్యక్రమంలో చీర రాజు, ఉరిటి శ్రీను, కల్యాణ్, బమ్మిడి త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు ఫ్యాన్లు వితరణ



ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌కు ఫ్యాన్లు అందిస్తున్న సొసైటీ ప్రతినిధులు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు పెందుర్తి ప్రాంత కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ వెల్ఫేర్ సొసైటీ సీలింగ్ ఫా ‌ ‌ ‌ ‌ ‌ యన్లు వితరణ చేసింది. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్‌కు అయిదు ఫా ‌ ‌ ‌ ‌ యన్లు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు జి.సత్యగణపతిరావు, ఆర్ఎస్.శేఖర్‌బాబు, జి.భాస్కర్, జి.మురళి, డీబీ.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రంగా మారేదెన్నడో..?



వెన్నెలపాలెంలో రైతు భరోసా కేంద్రం పేరుతో దర్శనమిస్తున్న భవనం

పరవాడ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కొలువు దీరి 100 రోజులు దాటింది. గత వైకాపా ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బీకే) పేరును కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలు(ఆర్ఎస్‌కే)గా మార్చింది. అయితే పరవాడ మండలంలోని వెన్నెలపాలెం, తానాం, నాయుడుపాలెం తదితర గ్రామాల్లోని భవనాలపైన పేర్లు ఇప్పటికీ రైతు భరోసా కేంద్రాలుగానే ఉండటం గమనార్హం. ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా పేరు ఎందుకు మార్చలేదని పలువురు కూటమి నాయకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చాలని వారంతా కోరుతున్నారు.

ఆసుపత్రిలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం



శ్రమదానంలో పాల్గొన్న సబ్బవరం డిగ్రీ కళాశాల విద్యార్థులు

సబ్బవరం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) విద్యార్థులు గురువారం సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శ్రమదానం చేశారు. ఆసుపత్రిలో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త లెక్కల గణేశ్ మాట్లాడుతూ మన ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను సమాజ బాధ్యతగా భావించినపుడే పరిశుభ్రమైన సమాజం ఏర్పడుతుందన్నారు.

భారీ వర్షం.. రహదారులు జలమయం

పెందుర్తి, వేపగుంట, పరవాడ, న్యూస్‌టుడే: అల్పపీడనం కారణంగా నగరంతో పాటు పెందుర్తి, పరవాడ మండలాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు కురిసిన వర్షానికి రహదారులు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాలు జలమయమై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాఠశాలల్లో నాడు - నేడు పనులు అస్తవ్యస్తంగా చేపట్టడంతో వర్షపునీరు బయటకు పోయేందుకు తగిన మార్గాలు లేకుండా పోయాయి. వేపగుంట - గోశాల మార్గంలోని బీఆర్టీఎస్ రహదారిలో ఎగువ నుంచి వచ్చిన వరద నీరు పెద్దఎత్తున నిలిచిపోయింది. దీంతో వాహన చోదకులు రాకపోకలకు అవస్థలు పడ్డారు. వేపగుంట, నరవ జెడ్పీ పాఠశాలలు, 93వ వార్డు గొల్లనారాయణపురం, పల్లినారాయణపురం ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. భరణికం మొల్లోడు గెడ్డ, తానాం వాగు, ఫార్మాసిటీ తదితర ప్రాంతాల్లోని కాలువలు ఉద్ధృతంగా ప్రవహించాయి. ఫార్మాసిటీలోని అరబిందో పరిశ్రమ వద్ద, పరవాడ నుంచి లంకెలపాలెం వెళ్లే మార్గంలోని తిరుపతి ఫ్యూయల్స్ కంపెనీ వద్ద పెద్దఎత్తున నీరు నిలిచిపోవడంతో అటుగా పయనించడానికి వాహనచోదకులు నానా ఇబ్బందులు పడ్డారు. పరవాడ పెద్దచెరువు, ఊరచెరువు, స్వయంభూవరం, కలపాక, తానాంలోని తటాకాలు నీటితో నిండి కళకళలాడుతున్నాయి. వర్షానికి పలు గ్రామాల్లోని మట్టిరోడ్లు చిత్తడిగా మారాయి.



పల్లినారాయణపురం పాఠశాల ప్రాంగణంలో వరద



వేపగుంట - గోశాల బీఆర్టీఎస్ రహదారిలో నిలిచిన నీరు



పరవాడ - లంకెలపాలెం రహదారిలో..



అరబిందో కంపెనీ మార్గంలో స్తంభించిన వరద



ఉద్ధృతంగా ప్రవహిస్తున్న భరణికం మొల్లోడు గెడ్డ

పాలనను గాడినపెట్టే పనిలో ప్రభుత్వం నిమగ్నం



పెందుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, చిత్రంలో కూటమి నేతలు

పెందుర్తి, న్యూస్‌టుడే: అయిదేళ్ల పాటు అస్తవ్యస్థంగా సాగిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనను గాడిన పెట్టే పనిలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిమగ్నమైందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పేర్కొన్నారు. జీవీఎంసీ 96వ వార్డు పరిధి పెందుర్తిలోని తాండ్ర పాపారాయుడు కల్యాణ మండపంలో గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు ఎప్పుడూ ప్రజలకు జవాబుదారీగా ఉంటారన్నారు. జగన్ అయిదేళ్లు విచ్చలవిడి పాలన చేశారన్నారు. ఆస్తులు కొల్లగొట్టి, రౌడీయిజం చేసి అక్రమ కేసులతో ప్రతిపక్ష నేతలను వేధించారన్నారు. అనంతరం వంద రోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. జోన్-8 జెడ్సీ హేమవతి అందరితో సచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. భాజపా నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రామునాయుడు, 96వ వార్డు తెదేపా, జనసేన అధ్యక్షులు వేగి పరమేశ్వరరావు, దాడి సంతోష్, జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, నాయకులు పీలా జితేంద్ర, పెంటకోట రాజేంద్రప్రసాద్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవస్థానం భూ సమస్య పరిష్కారానికి కృషి

వేపగుంట, న్యూస్‌టుడే: సింహాచలం దేవస్థానం భూ సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. వేపగుంట కూడలిలోని జీవీఎంసీ సామాజిక భవనంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, దేవాదాయశాఖ మంత్రి, అధికారులతో సమావేశం నిర్వహించామన్నారు. మరికొద్ది రోజుల్లోనే ఈ సమస్యకు పరిష్కారం లభించనుందన్నారు. ఇటీవల విజయవాడ ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేసేందుకు వెళ్లిన కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గం ప్రత్యేక అధికారిణి శేషశైలజ, కార్పొరేటరు బల్ల శ్రీనివాసరావు, వార్డు జనసేన అధ్యక్షురాలు పిన్నింటి పార్వతి, జిల్లా తెదేపా మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శి శోభారాణి, నామాల అరుణ, యర్రా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



వేపగుంట సభకు హాజరైన ప్రజలు

దసరా ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ ఫ్రెండ్స్ యూనియన్ ఆధ్వర్యంలో సింహాచలం కొండ దిగువన మార్కెట్ ప్రాంతంలో అక్టోబర్ 3 నుంచి 12 వరకు జరగనున్న దుర్గా నవరాత్రి మహోత్సవాల ప్రచార కరపత్రాన్ని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. గురువారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్న అనంతరం మాడవీధిలో కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో 98వ వార్డు కార్పొరేటర్ పీవీ.నరసింహం, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మోసం కేసులో నిందితుడి అరెస్టు

గాజువాక, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ ట్రేడింగ్ వ్యాపారం పేరిట పలువురిని మోసం చేసిన నిందితుడిని గురువారం గాజువాక పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలు.. వుడాకాలనీకి చెందిన ఎన్.శ్రీనివాసరావు(53) ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని పలువురిని నమ్మించి వివిధ డిపాజిట్ స్కీముల్లో సభ్యులుగా చేర్పించాడు. కొద్ది రోజుల నుంచి శ్రీనివాసరావు ముఖం చాటేయడంతో ఖాతాదారులంతా పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: భక్తుల కొంగు బంగారంగా సింహగిరిపై వెలుగొందుతున్న అప్పన్న స్వామికి గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని శోభాయమానంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో దేవతామూర్తులకు అష్టోత్తర శత నామార్చన జరిపారు. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. గురువారం సందర్భంగా అంతరాలయంలో స్వామి బంగారు శాంత నృసింహ కవచం అలంకరణలో భక్తులను అనుగ్రహించారు.

'కేంద్రంపై ఒత్తిడి పెంచాలి'

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి ఉక్కు కర్మాగారం పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కృషి చేయాలని పోరాట కమిటీ నాయకుడు వి.శ్రీనివాసరావు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కొనసాగుతున్న దీక్షలు గురువారం 1323వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు, అమరావతితో పాటు ఉక్కు కర్మాగారం పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శిబిరంలో జేఎంఎస్, డీఐటీయూ, వీఎస్ఈయూ, యూజ్ సంఘాల ప్రతినిధులు కూర్చున్నారు. పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మహాలక్ష్మినాయుడు, కె.పరంధామయ్య, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు బోగీలు



రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు స్లీపర్, సాధారణ బోగీలు జత చేయనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

★ అక్టోబర్ 2, 11 తేదీల్లో భువనేశ్వర్-కేఎస్ఆర్ బెంగళూర్(18463), అక్టోబరు 3, 12 తేదీల్లో కేఎస్ఆర్ బెంగళూర్ - భువనేశ్వర్ (18463) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఒక స్లీపర్ బోగీ ★ అక్టోబరు 6 నుంచి నవంబరు 10 వరకు భువనేశ్వర్-తిరుపతి(22871), అక్టోబర్ 7 నుంచి నవంబరు 11 వరకు తిరుపతి-భువనేశ్వర్(22872) వారాంతపు రైళ్లకు ఒక సాధారణ రెండో తరగతి బోగీ ★ అక్టోబరు 1 నుంచి నవంబరు 5 వరకు భువనేశ్వర్-పుణె(22882), అక్టోబర్ 3 నుంచి నవంబరు 7 వరకు పుణె-భువనేశ్వర్(22881) వారాంతపు రైళ్లకు సాధారణ రెండో తరగతి బోగీ ★ అక్టోబరు 4 నుంచి 28 వరకు సంబల్‌పూర్-నాందేడ్(20809), అక్టోబర్ 5 నుంచి 29 వరకు నాందేడ్- సంబల్‌పూర్(20810) నాగావళి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఒక థర్డ్ ఎ.సి, ఒక స్లీపర్ బోగీ జత చేయనున్నట్లు తెలిపారు. ★ అక్టోబరు 2 నుంచి 30 వరకు సంబల్‌పూర్-ఈరోడ్(08311), అక్టోబరు 4 నుంచి నవంబరు 1 వరకు ఈరోడ్-సంబల్‌పూర్(08312) రైళ్లకు ఒక థర్డ్ ఎ.సి, ఒక స్లీపర్ బోగీ జత చేయనున్నట్లు తెలిపారు. ★ అక్టోబరు 1 నుంచి 31 వరకు విశాఖ-కిరండూల్-విశాఖ(08551-08552) రైళ్లకు ఒక స్లీపర్ బోగీ ★ అక్టోబరు 1 నుంచి 31 వరకు విశాఖ- గుణుపూర్-విశాఖ(08522-08521) రైళ్లకు ఒక స్లీపర్ బోగీ ★ అక్టోబరు 3 నుంచి నవంబరు 14 వరకు భువనేశ్వర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(12830), అక్టోబరు 4 నుంచి నవంబరు 15 వరకు ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-భువనేశ్వర్(12829) రైళ్లకు ఒక సాధారణ బోగీ ★ అక్టోబరు 6 నుంచి నవంబరు 17 వరకు భువనేశ్వర్-ఎస్ఎంవీటీ బెంగళూర్(12845), అక్టోబరు 7 నుంచి నవంబరు 18 వరకు ఎస్ఎంవీటీ బెంగళూర్- భువనేశ్వర్ (12846) రైళ్లకు ఒక సాధారణ రెండో తరగతి బోగీ ★ అక్టోబరు 1 నుంచి నవంబరు 12 వరకు భువనేశ్వర్-పుదుచ్చేరి(12898), అక్టోబరు 2 నుంచి నవంబరు 13 వరకు పుదుచ్చేరి- భువనేశ్వర్ (12897) రైళ్లకు సాధారణ రెండో తరగతి బోగీ ★ అక్టోబరు 4 నుంచి నవంబరు 15 వరకు భువనేశ్వర్- రామేశ్వరం(20896), అక్టోబరు 6 నుంచి నవంబరు 17 వరకు రామేశ్వరం-భువనేశ్వర్(20895) రైళ్లకు ఒక సాధారణ రెండో తరగతి బోగీ జత చేయనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు గమనించి ఈ అదనపు బోగీలు సేవలు వినియోగించుకోవాలని కోరారు.

అ వీ ఇ వీ

గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీపై ఆరా



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి కూడలిలో గురువారం మధ్యాహ్నం ఓ గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కేజీహెచ్‌లో చేర్పించినట్లు ఎస్ఐ అసిరితాత తెలిపారు. సుమారు 50 ఏళ్ల వయసున్న వ్యక్తి పెందుర్తి కూడలిలో సంచరిస్తూ నీరసించి పడిపోయినట్లు తెలిపారు. కళ్లు సక్రమంగా కనిపించని ఇతనికి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అతడి ఆచూకీ తెలిసిన వారు పెందుర్తి పోలీసులను సంప్రదించాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో ఫార్మా కార్మికుడి మృతి

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెంలో గురువారం ఉదయం అనుమానాస్పద స్థితిలో ఫార్మా కార్మికుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విశ్వజీత్ రభర్(25) గతకొంతకాలంగా ఫార్మాసిటీలో పని చేస్తూ తోటి కార్మికులతో కలిసి లంకెలపాలెం కూడలిలోని అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. గురువారం తెల్లవారుజామున విశ్వజీత్ రభర్ అనారోగ్యంగా ఉందని చెప్పి మాత్రలు తీసుకురమ్మని సోదరుడు సూరజ్ రభర్‌కు చెప్పడంతో వెంటనే మాత్రలు తీసుకురావడానికి దుకాణానికి వెళ్లాడు. అతను తిరిగి వచ్చేలోపు విశ్వజీత్ రభర్ కిందపడిపోయి ఉన్నాడు. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం అగనంపూడి సీహెచ్‌సీకి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

చెట్ల కొమ్మల్లో విద్యుత్తు స్తంభాలు

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట దరి రవినగర్‌లోని నర్సింగ బిల్లమ్మ ఆలయ సమీపంలోని విద్యుత్తు స్తంభాలు చెట్ల పొదల మధ్యన ఉన్నాయి. దీంతో రాత్రుళ్లు వెలుగులు సక్రమంగా ప్రసరించడం లేదని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్తు తీగలు కొమ్మలకు తాకడంతో తరచూ నిప్పురవ్వలు పడుతున్నాయని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తున్నందున ఇక్కడ ఉన్న రెండు విద్యుత్తు స్తంభాలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి చెట్ల కొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.





ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభ

ఇస్లాంపేట(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి ఇస్లాంపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో ప్రతిభ చాటారు. ఈనెల 25న గాజువాకలో జరిగిన నియోజకవర్గ స్థాయి ఖోఖో పోటీల్లో అండర్ -17 విభాగంలో సందీప్ కుమార్, రబీనాబేగం, అండర్-14 విభాగంలో సూరజ్‌కుమార్, డి.సాయి, నౌసినాకౌజర్, వాలీబాల్ అండర్-17 విభాగంలో జశ్వంత్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, లలితబుద్ర, సీహెచ్ యామిని, చెస్ పోటీల్లో నీతాకుమారి ప్రతిభ చాటి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విజేతలతో పాటు పీడీ ఎస్.నరసింహమూర్తిని ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, ఉపాధ్యాయులు అభినందించారు.



ప్రతిభచాటిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, పీడీ నరసింహామూర్తి, ఉపాధ్యాయులు